S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక



epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565



సంపుటి: 19 | సంచిక: 187 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 15 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |




5

## వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'

**పొదుపు మంత్రంపై ఏపీ కేబినెట్‌లో విస్తృత చర్చ**

- కీలక ప్రాజెక్టులకు ఆమోదం
- వర్క్ ఫ్రమ్ హోమ్, సైకిల్‌పై సచివాలయానికి రావాలని సీఎం పిలుపు
- ఆలస్యంగా వచ్చిన అధికారులపై బాబు ఆగ్రహం

**40 అంశాలకు కేబినెట్ ఆమోదం**

రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులకు ఓకే

ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి

5

# బీజేపీ పాలిత రాష్ట్రాలే లీక్ కేంద్రాలు

## పదేళ్లలో 93 పేపర్లు లీక్‌లు



- రెండు కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం
- నీట్ రాసిన విద్యార్థులకు అండగా ఉంటాం
- నీట్ రద్దు 'పెద్ద నోట్ల రద్దు' వంటిదే..
- మోడీ సర్కార్ వైఫల్యంపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

నీట్-యూజీ 2026 రద్దు నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష, నియంతృత్వ నిర్ణయం వల్ల దేశంలోని కోట్లాది మంది యువత భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశవ్యాప్తంగా 93 పేపర్లు లీక్ అయ్యాయని, ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు.

**హైదరాబాద్, మే 14:** నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయ మని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడు తుందన్నారు. గత పదేండ్లుగా ప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడి లో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కార ణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2 లో



### 'నా భారతదేశం - నా కర్తవ్యం' షురూ

- పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం..
- వారానికి 2 రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్'
- వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'..

.. వివరాలు 4లో



### చక్కెర ఎగుమతులపై కేంద్రం నిషేధం

ధరల నియంత్రణే లక్ష్యం

.. వివరాలు 4లో




### 'గోల్డెన్ తీఫ్' గ్యాంగ్ అరెస్ట్

పీఎంజే జ్యూవెలరీ దోపిడీ కేసును ఛేదించిన కరీంనగర్‌పోలీసులు

బీహార్‌కు చెందిన ముగ్గురు దొంగల గుర్తింపు..

రూ.82 లక్షల విలువైన బంగారం స్వాధీనం

.. వివరాలు 3లో

## ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్

**ఇంటర్ విద్యలో విప్లవాత్మక మార్పులు**

థియరీ మార్కులు తగ్గింపు..

ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు పెద్దపీట

2026-27 నుంచి కొత్త విధానం..

ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్‌లో ఊరట

2





## ప్రతిభకు పట్టాభిషేకం

బీసీ విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారాల' ప్రదానం

కొమురం భీమ్ భవన్‌లో ఘనంగా వేడుక..

హాజరైన మంత్రులు పొన్నం, వాకిటి

విద్యే బానిసత్వం నుంచి విముక్తి కలిగిస్తుంది..

రాజకీయాల్లో బీసీలు రాణించాలి: మంత్రి శ్రీహరి

2

## నేటి నుంచి 'సీపీగెట్' దరఖాస్తుల స్వీకరణ

పీజీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి




జూన్ 10 వరకు గడువు..

జులై తొలివారంలో ఆన్‌లైన్ పరీక్షలు

తొలిసారి పరీక్ష నిర్వహిస్తున్న కాకతీయ వర్సిటీ..

ఆగస్టులో తరగతుల ప్రారంభం

2

## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

- కేంద్రంపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- పెరిగిన సాగు వ్యయాలకు అనుగుణంగా మద్దతు ధరలు లేవు..
- భద్రాద్రిలో పామాయిల్ రైతుల ఆత్మీయ సత్కారం..
- 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై తుమ్మల భావోద్వేగం

కేంద్ర ప్రభుత్వం రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను బుట్టదాఖలు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని భావోద్వేగానికి లోనయ్యారు.

2





### మరోమారు తెరపైకి ఫార్ములా-ఈ కేసు

కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

జూలై 31న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం..

2

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్

- నేడు హైకోర్టు కీలక నిర్ణయం
- ముందస్తు బెయిల్ విచారణ వారం వాయిదా.. మధ్యంతర రక్షణపై ఉత్కంఠ
- నిందితుడు సామాన్యుడే.. పదే పదే హోదా ప్రస్తావన వద్దన్న న్యాయస్థానం

3




## సింగరేణి గనుల్లో 'మహిళా శక్తి'

**ఇక భారీ డంపర్ల స్టీరింగ్ పట్టనున్న అతివలు**

**తొలిసారిగా 13 మంది మహిళా ఆపరేటర్ల నియామకం**

**సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం ఆదేశాలతో కీలక నిర్ణయం**

సింగరేణి బొగ్గు గనుల చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు కేవలం పురుషులకే పరిమితమైన భారీ డంపర్ల ఆపరేటింగ్‌లో ఇకపై మహిళలు కూడా తమ సత్తా చాటనున్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సింగరేణి యాజమాన్యం తొలిసారిగా మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. 60 నుండి 100 టన్నుల బరువు మోసే భారీ వాహనాలను నడిపేందుకు 13 మంది మహిళా ఉద్యోగులు సర్వసిద్ధమయ్యారు.

2





## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు
# బుట్టదాఖలు
## కేంద్రంపై మంత్రి తుమ్మల ఆగ్రహం

**పెరిగిన సాగు వ్యయాలకు అనుగుణంగా మద్దతు ధరలు లేవు..**

### కేంద్రం రైతులను మోసం చేస్తోంది

**భద్రాద్రిలో పామాయిల్ రైతుల ఆత్మీయ సత్కారం..**

### 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై తుమ్మల భావోద్వేగం

**భద్రాద్రి కొత్తగూడెం, మే 14:** కేంద్ర ప్రభుత్వం రైతాంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను బుట్టదాఖలు చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. సాగు వ్యయం భారీగా పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెంచకపోవడం వల్ల రైతులు దళారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిగా 40 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో పది ఉమ్మడి జిల్లాల పామాయిల్ రైతులు గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, కేంద్రం సహకరించకపోయినా రైతుల ప్రయోజనాల కోసం మొక్కజొన్న, జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. ఈ కొనుగోళ్ల వల్ల తెలంగాణ ప్రభుత్వంపై రూ.4 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. వరి మద్దతు ధరను కేంద్రం కేవలం 72 శాతం మాత్రమే పెంచిందని, మొక్కజొన్నపై 10 శాతం పెంపు ఏమాత్రం సరిపోదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దతు ధరలను కనీసం 30 నుంచి 40 శాతం వరకు పెంచాలని, ప్రతి పంటలో 75 శాతం దిగుబడిని కేంద్రమే సేకరించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, కోతుల బెడద, చీడపీడల నుంచి తప్పించుకోవాలంటే రైతులు పామాయిల్ సాగు వైపు మళ్లాలని మంత్రి సూచించారు. దివంగత సీఎం ఎన్టీఆర్ హయాంలో అశ్వారావుపేటలో ప్రారంభమైన పామాయిల్ సాగు, నేడు లక్షలాది మంది రైతుల తలరాతను మారుస్తోందని కొనియాడారు. మన దేశం ఏటా లక్ష కోట్ల రూపాయల పామాయిల్‌ను దిగుమతి చేసుకుంటోందని, దిగుమతి సుంకాన్ని పెంచితే స్వదేశీ రైతులకు మరింత మెరుగైన ధర లభిస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో తెలంగాణకు పామాయిల్ సాగు ఒక వరంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**చివరి శ్వాస వరకు ప్రజా సేవలోనే..**

తన 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో భద్రాద్రి రాముని దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధిలో భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తుమ్మల భావోద్వేగానికి లోనయ్యారు. పదవులు ముఖ్యం కాదని, ముందు తరాలకు మేలు చేసే పనులు చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది కాలంలోనే రైతాంగం కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని గుర్తుచేశారు. తన ప్రస్థానంలో సహకరించిన ముఖ్యమంత్రులు, అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ, చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటానని మంత్రి ఉద్ఘాటించారు.

## మరోమారు తెరపైకి
# ఫార్ములా-ఈ కేసు
## కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

**జూలై 31న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం**

**హైదరాబాద్, మే 14:** తెలంగాణలో గత కొద్దికాలంగా సంచలనం రేపుతున్న ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో జరిగిన అక్రమాలపై ఏసీబీ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని (ఛార్జ్‌షీట్) ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ మేరకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో పాటు పలువురు కీలక అధికారులకు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. జూలై 31వ తేదీన విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసు కోసం నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు నిధులు మళ్లించారన్నదే ఈ కేసులో ప్రధాన అభియోగం. హెచ్ఎండీఏ ఖాతా నుండి సుమారు 55 కోట్ల రూపాయలను ఎఫ్ఈఓ సంస్థకు ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే బదిలీ చేసినట్లు ఏసీబీ తన దర్యాప్తులో ప్రాథమికంగా గుర్తించింది. ఈ నిధుల మళ్లింపులో ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కారని, ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ చెల్లింపులు జరిపించారని ఏసీబీ తన అభియోగపత్రంలో పేర్కొంది.

**ఏ1గా కేటీఆర్.. ఏ2గా ఐఏఎస్ అధికారి**

ఈ కేసులో ఏసీబీ మొత్తం ఐదుగురిని నిందితులుగా పేర్కొంది. ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్ ఉండగా, ఏ2గా మున్సిపల్ శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4గా స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావును చేర్చింది. అలాగే ఏ5 నిందితుడిగా ఎఫ్ఈఓ సంస్థను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో ఏసీబీ అధికారులు కేటీఆర్ సహా ఇతర నిందితులను పలుమార్లు ప్రశ్నించి వాంగ్మూలాలను సేకరించారు. తాజాగా కోర్టు సమన్లు జారీ చేసిన నేపథ్యంలో, జూలై 31న జరిగే విచారణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# బీజేపీ పాలిత రాష్ట్రాలే లీక్‌ల కేంద్రాలు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, మే 14: నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడంబాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్



అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డెకేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## ప్రతిభకు పట్టాభిషేకం

**బీసీ విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారాల' ప్రదానం**

**బంజారాహిల్స్‌లో ఘనంగా వేడుక..**

**హాజరైన మంత్రులు పొన్నం, వాకిటి**

**విద్యే బానిసత్వం నుంచి విముక్తి కలిగిస్తుంది..**

**రాజకీయాల్లో బీసీలు రాణించాలి: మంత్రి శ్రీహరి**



**హైదరాబాద్, మే 14:** బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ప్రతిభా పురస్కారాల' ప్రదానోత్సవానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. విద్య మనిషికి వినయాన్ని ప్రసాదిస్తుందని, ఆ వినయమే వ్యక్తిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని పేర్కొన్నారు. "విద్య ప్రపంచాన్ని మార్చడమే కాకుండా, బానిసత్వం నుంచి బయటకు తీసుకువస్తుందని నెల్సన్ మండేలా, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు చాటిచెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సరస్వతీ దేవికి రంగు, రూపు తేడాలు ఉండవని, చదువుపై చూపే ఏకాగ్రతే మనల్ని ముందుకు నడిపిస్తుందని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి వివరించారు. గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఒత్తిడి లేకుండా 25 వేల మందికి బదిలీలు, ప్రమోషన్లు కల్పించామని గుర్తుచేశారు. అలాగే, వందేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కులగణనను ప్రజా ప్రభుత్వం చేపట్టిందని, అన్ని రంగాల్లో బీసీలు ముందుండాలన్నదే ప్రభుత్వ ఆశయమని స్పష్టం చేశారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికై దేశ భవిష్యత్తును మార్చే చట్టాలు చేయాలని మంత్రి శ్రీహరి ఆకాంక్షించారు. రాజకీయాలపై ఉన్న పాత ధోరణులను విడనాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్

**ఇంటర్ విద్యలో విప్లవాత్మక మార్పులు**

**థియరీ మార్కులు తగ్గింపు..**

**ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు పెద్దపీట**

**2026-27 నుంచి కొత్త విధానం..**

**ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్‌లో ఊరట**



**హైదరాబాద్, మే 14:** తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి రాష్ట్రంలోని ఇంటర్ విద్యా విధానంలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో ప్రయోగాత్మక అవగాహనను పెంచే లక్ష్యంతో 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త పరీక్షా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు గురువారం కీలక వివరాలను వెల్లడించారు. ఇప్పటివరకు కేవలం సెకండియర్‌లో మాత్రమే 30 మార్కులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను ఇకపై రెండు సంవత్సరాలకు విభజించారు. సైన్స్ సబ్జెక్టులైన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీల్లో ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. దీనివల్ల థియరీ పరీక్షలు 60 మార్కులకే పరిమితం కానున్నాయి. గణితంలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు 75 మార్కులకు ఉన్న థియరీ పరీక్షను 60 మార్కులకు తగ్గించారు. మిగిలిన 15 మార్కులను 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' కింద ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించారు. ముఖ్యంగా ఎంఈసీ విద్యార్థులకు శుభవార్త చెబుతూ, ఇకపై వారికి ఎంపీసీ విద్యార్థులతో సంబంధం లేకుండా ప్రత్యేకమైన గణితం ప్రశ్నపత్రాన్ని రూపొందించాలని బోర్డు నిర్ణయించింది. తెలుగు, ఇంగ్లీష్ వంటి భాషా సబ్జెక్టులతో పాటు కామర్స్, ఎకనామిక్స్ వంటి హ్యూమానిటీస్ గ్రూపుల్లో కూడా ఇంటర్నల్ మార్కులను ప్రవేశపెట్టారు. 100 మార్కుల థియరీ పరీక్షను 80 మార్కులకు తగ్గించి, మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించారు. దీనివల్ల విద్యార్థులపై వార్షిక పరీక్షల ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులతో 'ఏసీఈ' అనే కొత్త గ్రూపును బోర్డు పరిచయం చేస్తోంది. అలాగే, ఫస్టియర్ విద్యార్థుల కోసం సరికొత్త పాఠ్యపుస్తకాలను సిద్ధం చేశారు. నిపుణుల కమిటీ రూపొందించిన ఈ పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌లు, ఇన్ఫో గ్రాఫిక్స్, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ వంటి ఆధునిక అంశాలను పొందుపరిచారు. ఈ పుస్తకాలను జూన్ 1 లోపు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు బోర్డు స్పష్టం చేసింది.

# సింగరేణి గనుల్లో 'మహిళా శక్తి'

**ఇక భారీ డంపర్ల స్టీరింగ్ పట్టనున్న అతివలు**

- తొలిసారిగా 13 మంది మహిళా ఆపరేటర్ల నియామకం
- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం ఆదేశాలతో కీలక నిర్ణయం



**హైదరాబాద్, మే 14:** సింగరేణి బొగ్గు గనుల చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు కేవలం పురుషులకే పరిమితమైన భారీ డంపర్ల ఆపరేటింగ్‌లో ఇకపై మహిళలు కూడా తమ సత్తా చాటనున్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సింగరేణి యాజమాన్యం తొలిసారిగా మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. 60 నుండి 100 టన్నుల బరువు మోసే భారీ వాహనాలను నడిపేందుకు 13 మంది మహిళా ఉద్యోగులు సర్వసిద్ధమయ్యారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ రవాణా చేసే భారీ డంపర్లను నడపడం శారీరక దృఢత్వంతో పాటు ఎంతో నైపుణ్యంతో కూడుకున్న పని. ఎండ, వాన, చలి వంటి వాతావరణ పరిస్థితులను తట్టుకుని మూడు షిఫ్టుల్లో పని చేయాల్సి ఉంటుంది. 50ఏళ్లుగా ఈ పనులను పురుషులు మాత్రమే నిర్వహిస్తూ వచ్చారు. అయితే, మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళా శక్తిని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించడంతో యాజమాన్యం ఈ విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ విధులకు ఆసక్తి చూపిన సుమారు 35 మంది మహిళా ఉద్యోగుల్లో, అర్హులైన వారికి సిరిసిల్లలోని 'తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్' ద్వారా భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించారు. కంపెనీయే స్వయంగా ఖర్చు భరించి ఈ శిక్షణను పూర్తి చేయించింది. శిక్షణ పొందిన 13 మంది మహిళా ఉద్యోగులు తాము క్షేత్రస్థాయిలో బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. వీరందరికీ త్వరలోనే డంపర్ ఆపరేటర్లుగా నియామక పత్రాలు అందనున్నాయి.

**అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా..**

"మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్న ఈ రోజుల్లో, గనుల్లో డంపర్లు నడపడం అసాధ్యమేమీ కాదు" అని శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా ఆపరేటర్లు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. కాగా, ఇప్పటికే బెల్లంపల్లి ఖైరిగూడ గనిలో అత్యంత క్లిష్టమైన 'బ్లాస్టింగ్' విభాగంలో మహిళలు రాణిస్తున్నారని అధికారులు వెల్లడించారు. అలాగే, సంస్థ చరిత్రలో తొలిసారిగా 'మహిళా రెస్క్యూ జట్టు'ను కూడా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఇకపై అన్ని క్లిష్టతరమైన బాధ్యతల్లో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పిస్తామని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.




# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్

## నేడు హైకోర్టు కీలక నిర్ణయం

**ముందస్తు బెయిల్ విచారణ వారం వాయిదా.. మధ్యంతర రక్షణపై ఉత్కంఠ**

**నిందితుడు సామాన్యుడే.. పదే పదే హోదా ప్రస్తావన వద్దన్న న్యాయస్థానం**

**హైదరాబాద్, మే 14:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో న్యాయస్థానం విచారణ కీలక దశకు చేరుకుంది. భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ వారం రోజుల పాటు వాయిదా వేసింది. అయితే, ఈ లోపు పోలీసులు అరెస్టు చేయకుండా మధ్యంతర రక్షణ (ఇన్టెరిమ్ ప్రొటెక్షన్) కల్పించాలన్న విజ్ఞప్తిపై న్యాయస్థానం శుక్రవారం (మే 15) తన నిర్ణయాన్ని వెల్లడించనుంది. గురువారం జరిగిన విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపిస్తూ.. నిందితుడు ఒక కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో సాక్ష్యాధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని, బాధితురాలిపై కరీంనగర్‌లో తప్పుడు కేసులు కూడా పెట్టించారని కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ప్రతిసారీ నిందితుడి హోదాను పదే పదే ప్రస్తావించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. చట్టం ముందు అందరూ సామాన్యులేనని గుర్తు చేసింది.

**పోక్సో చట్టం వర్తించదు - రక్షణ కావాలి**

భగీరథ్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. బాధితురాలు మైనర్ కాదని, గతంలో ఆమెపై నమోదైన ఒక కేసు రికార్డుల ప్రకారం ప్రస్తుతం ఆమె వయస్సు 19 నుంచి 20 ఏళ్ల మధ్య ఉంటుందని, కాబట్టి పోక్సో చట్టం వర్తించదని వాదించారు. రాజకీయ కారణాలతోనే ఈ కేసులో అక్రమంగా పోక్సో సెక్షన్లు చేర్చారని ఆరోపించారు. ముందస్తు బెయిల్ పిటిషన్ వారం వాయిదా పడినందున, ఈ వారం రోజుల్లో అరెస్టు జరగకుండా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

**నేడే తుది నిర్ణయం**

బాధితురాలి వాదనలు కూడా వినాలని ఆమె తరఫు న్యాయవాది కోరడంతో, హైకోర్టు మధ్యంతర బెయిల్ అంశాన్ని శుక్రవారానికి వాయిదా వేసింది. ఇప్పటికే పేట్ బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌కు నోటీసులు జారీ చేయగా, ఆయన వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో నేడు హైకోర్టు ఇచ్చే తీర్పు భగీరథ్ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ మధ్యంతర రక్షణ లభించకపోతే పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# హైదరాబాద్‌లో మరోమారు భారీగా డ్రగ్స్ పట్టివేత

**డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి పట్టివేత**



**హైదరాబాద్, మే 14:** నగరంలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సూరారం– కొంపల్లి హైటెన్షన్ రోడ్‌లో డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇన్నోవా కారులో డ్రగ్స్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో కారు ఆపిన అధికారులు.. తనిఖీలు చేపట్టగా డ్రగ్స్ బయటపడింది. నిందితులు నుంచి మూడు గ్రాములు ఎండీఎంఏ, 36 గ్రాముల ఓజీ కుష్, 7 గ్రాముల చరస్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.2.58 లక్షలు ఉంటుందని అంచనా. బడా బాబుల పిల్లలే టార్గెట్‌గా డ్రగ్స్ అమ్మకాలు జరిపి.. నిందితులు భారీగా సొమ్ము చేసుకుంటు న్నట్లు ఎస్టీఎఫ్‌బీ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. డ్రగ్స్‌తో పాటు కారును సీజ్ చేశారు. డ్రగ్స్‌ను ఎవరి వద్ద నుంచి కొనుగోలు చేస్తున్నారు, ఎప్పటి నుంచి ఈ దందా నడిపిస్తున్నారనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల వెనక పెద్ద ముఠా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# చెన్నై ఎక్స్‌పెస్‌లో సాంకేతిక లోపం

**నల్లగొండ, మే 14:** నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు పాటు నిలిచిపోయింది. ఇంజిన్‌లో విద్యుత్ సమస్య తలెత్తడంతో రైలు ఆగిపోయింది. మరమ్మతుల అనంతరం రైలు 9:50 గంటలకు బయలుదేరి వెళ్లింది. ట్రెయిన్ ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండాకాలం కావడంతో ట్రైన్‌లో ఫ్యాన్లు, ఏసిలు పనిచేయకపోవడంతో నానాయాతన పడ్డారు.

# రైస్ మిల్లులో మంత్రుల మెరుపు తనిఖీ

- బీహార్ హమాలీలతో ముచ్చట
- ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియపై ఆరా..
- మిల్లర్లు సహకరించాలని విజ్ఞప్తి
- సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచన



**నల్గొండ, మే 14:** నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని బాలాజీ రైస్ మిల్లును మంత్రుల బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కలిసి మిల్లులో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు రైస్ మిల్లు యజమానులతో పాటు అక్కడ పనిచేస్తున్న హమాలీలతో ముఖాముఖి మాట్లాడి వివరాలు సేకరించారు. మిల్లులో పనిచేస్తున్న హమాలీలను మంత్రులు పలకరిస్తూ ఎక్కడి నుండి వచ్చారని ఆరా తీశారు. తాము బీహార్ నుండి వచ్చామని, ప్రతిరోజూ 10 నుండి 15 లారీలను అన్‌లోడ్ చేస్తున్నామని వారు మంత్రులకు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ధాన్యం రాక ఎక్కువగా ఉన్నందున, హమాలీలు ఇంకా కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని మంత్రులు కోరారు. పని చేసే చోట ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ తమ వద్దకు వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేసుకుంటే నిల్వ సమస్యలు తలెత్తవని మంత్రులు అభిప్రాయపడ్డారు. మిల్లుల్లో అన్‌లోడింగ్ వేగంగా జరిగితేనే కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం లారీలను వెంటనే మిల్లులకు పంపేందుకు వీలవుతుందని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు ఈ విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం అయ్యేలా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రులు విజ్ఞప్తి చేశారు.

# చేప ప్రసాదం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి



- జూన్ 8న నాంపల్లి గ్రౌండ్స్‌లో పంపిణీ.
- అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

**హైదరాబాద్, మే 14:** మృగశిర కార్తి పురస్కరించుకుని జూన్ 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఆయన ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు 24 గంటల పాటు నిరంతరాయంగా జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుండి లక్షలాది మంది ఆస్తమా బాధితులు వచ్చే అవకాశం ఉన్నందున, ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే భక్తులకు క్యూ లైన్లలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు మరియు అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని షెడ్లను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ మళ్లింపు మరియు పార్కింగ్ విషయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే చోట పిక్‌పాకెటింగ్, చైన్ స్నాచింగ్ వంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అదనపు ఆర్టీసీ బస్సులను నడపాలని, మత్స్య శాఖ అధికారులు నాణ్యమైన చేప పిల్లలను తగినంత సంఖ్యలో సిద్ధం చేయాలని సూచించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, 1847లో ప్రారంభమైన చేప ప్రసాదం పంపిణీ 179 ఏళ్లుగా ప్రజల విశ్వాసంతో విజయవంతంగా కొనసాగుతోందని గుర్తుచేశారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, ఇది అన్ని వర్గాల ప్రజలు నమ్మకంతో పాల్గొనే కార్యక్రమమని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బత్తిని కుటుంబ సభ్యులు మరియు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషనర్ భేటీ

**పెట్టుబడులే లక్ష్యంగా చర్చలు**

**ఐటీ, ఇన్నోవేషన్ రంగాల్లో సహకారంపై ఆసక్తి**

**భవిష్యత్ భాగస్వామ్యంపై ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఆశాభావం**

**హైదరాబాద్, మే 14:** భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ గురువారం నందినగర్‌లోని నివాసంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ కూడా పాల్గొన్నారు. పరస్పర ప్రయోజనాలు మరియు వ్యూహాత్మక అంశాలపై ఈ ఉన్నత స్థాయి సమావేశంలో నేతలు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, మరియు విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. గతంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా పని చేసిన కేటీఆర్, హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా మరియు ఇన్నోవేషన్ రంగాల గురించి వివరించారు. తెలంగాణ మరియు ఆస్ట్రేలియా మధ్య పటిష్టమైన సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని ఆస్ట్రేలియా ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా ఈ చర్చలు సాగాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు మరియు సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో తెలంగాణలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఏర్పడిందని, అది ఆస్ట్రేలియా కంపెనీలకు గొప్ప అవకాశంగా మారుతుందని ఈ సందర్భంగా నేతల మధ్య చర్చకు వచ్చింది.



# 'గోల్డెన్ తీఫ్' సుబోధ్ గ్యాంగ్ అరెస్ట్

- పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసును ఛేదించిన కరీంనగర్‌పోలీసులు
- బీహార్‌కు చెందిన ముగ్గురి గుర్తింపు
- రూ.82 లక్షల బంగారం స్వాధీనం
- రెండు నెలల ముందే రెక్కీ..
- నకిలీ గుర్తింపు కార్డులతో తిరుగుతున్న ముఠా: సీపీ గౌస్ ఆలం




**కరీంనగర్, మే 14:** నగరంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో సినీ ఫక్కీలో కాల్పులు జరిపి, భారీ దోపిడీకి పాల్పడిన కేసును కరీంనగర్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ దారుణానికి ఒడిగట్టింది దేశవ్యాప్తంగా 'గోల్డెన్ తీఫ్'గా పేరుగాంచిన బీహార్‌కు చెందిన సుబోధ్ సింగ్ గ్యాంగ్ అని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సీపీ, ఈ కేసులో ప్రధాన నిందితుడు రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జరీగాసింగ్‌తో పాటు ప్రద్యుమన్, మెహతాబ్ ఖాన్‌లను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. దోపిడీకి రెండు నెలల ముందే ఈ ముఠా తెలంగాణకు వచ్చి ఖమ్మం, సిద్ధిపేట, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లోని ప్రముఖ బంగారు దుకాణాలపై రెక్కీ నిర్వహించినట్లు సీపీ తెలిపారు. దోపిడీ సమయంలో ఐదుగురు దొంగలు పిస్టల్స్‌తో లోపలికి ప్రవేశించి, అడ్డువచ్చిన సేల్స్ మేనేజర్ ముస్తాక్ అలీ, సిబ్బంది కమల్, మధుకర్ మరియు సెక్యూరిటీ గార్డు రాజేశ్‌పై కాల్పులు జరిపారు. కేవలం ఐదు నిమిషాల్లోనే పని ముగించుకున్న దొంగలు, సుమారు 161.4 తులాల (దాదాపు కిలోన్నర) బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. దీని విలువ సుమారు రూ. 82 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. దోపిడీ అనంతరం పల్సర్, అపాచీ బైక్‌లపై పరారైన నిందితులు, రైలు, బస్సుల ద్వారా తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు 12 రోజుల పాటు సుదీర్ఘ ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకున్నారు. నిందితులు దొరక్కుండా ఉండేందుకు నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ బైక్ నెంబర్లు, ఫేక్ పేర్లతో తిరుగుతుంటారని సీపీ వివరించారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని మెహతాబ్ వద్ద వీరు మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. బీహార్, బెంగాల్, జార్ఖండ్ వంటి పలు రాష్ట్రాల్లో ఈ ముఠాపై అనేక కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీ కార్యాలయం, జడ్జి నివాసాలకు సమీపంలోనే ఈ దోపిడీ జరగడంతో ప్రజల్లో వ్యక్తమైన ఆందోళనలను పోలీసులు తాజా అరెస్టులతో పటాపంచలు చేశారు.



## సంపాదకీయం

# కాన్వాయ్‌ల కార్లు తగ్గితే పొదుపు కాదు!

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ మోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖార్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు వియారన టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్త బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్ధనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్ధనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిదుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కోనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్దరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, ఖరైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్లర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

# 'నా భారతదేశం - నా కర్తవ్యం' షురూ

- పొదుపు చర్యలకు దిగిన ఢిల్లీ ప్రభుత్వం..
- వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్'
- వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'..
- మంత్రులకు 'మండే మెట్రో' తప్పనిసరి
- ముఖ్యమంత్రి రేఖాగుప్తా కీలక నిర్ణయాలు..



**న్యూఢిల్లీ, మే 14:** దేశవ్యాప్తంగా ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఢిల్లీ ప్రభుత్వం పలు సంస్కరణాత్మక చర్యలను ప్రకటించింది. ముఖ్యమంత్రి రేఖాగుప్తా నేతృత్వంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడం, ఇంధన వినియోగ నియంత్రణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నూతన విధానం రేపటి నుంచే అమల్లోకి రానుంది. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడంలో భాగంగా ముఖ్యమంత్రి తన కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను నాలుగుకు పరిమితం చేయడమే కాకుండా, అందులో రెండు ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే వినియోగించాలని నిర్ణయించి ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. పౌరుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు 'నా భారతదేశం – నా కర్తవ్యం' పేరుతో 90 రోజుల పాటు సాగే ప్రత్యేక ఉద్యమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వ ఉద్యోగులు, మంత్రులు, ఉన్నతాధికారులు ప్రతి సోమవారం తప్పనిసరిగా ఢిల్లీ మెట్రోలోనే ప్రయాణించాలని 'మండే మెట్రో' పేరుతో ప్రత్యేక నిబంధనను తీసుకువచ్చారు. సామాన్య ప్రజలు కూడా వారంలో కనీసం ఒక రోజైనా 'నో వెహికల్ డే' పాటించి సైకిళ్లు, బస్సులు వంటి పర్యావరణహిత రవాణా మార్గాలను ఎంచుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అలాగే, వచ్చే ఆరు నెలల వరకు ప్రభుత్వ శాఖలేవీ కొత్తగా పెట్రోల్, డీజిల్ లేదా ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయకూడదని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ వ్యయ నియంత్రణలో భాగంగా వచ్చే ఏడాది వరకు అన్ని అధికారిక విదేశీ పర్యటనలను ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. అత్యవసర పరిస్థితుల్లో మినహా ఎవరికీ విదేశీ ప్రయాణాలకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. మరోవైపు, ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ను 10 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో తీవ్రంగా ఉన్న వాయు కాలుష్య సమస్యను అదుపు చేసేందుకు ఈ వర్క్ ఫ్రమ్ హోమ్, మెట్రో వినియోగం వంటి చర్యలు ఎంతగానో తోడ్పడతాయని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



## మహా సీఎం వినూత్న ప్రయోగం

**రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై విధానసభకు ఫడ్నవీస్ ● కాన్వాయ్‌కి స్వస్తి పలికి బైక్‌పై పయనం..**

**ప్రధాని మోదీ పిలుపుతో కీలక నిర్ణయం**

**ముంబై, మే 14:** పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపునకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వినూత్నంగా స్పందించారు. ఇంధన పొదుపు దిశగా ఒక అడుగు ముందుకేసి, తన అధికారిక కార్ల కాన్వాయ్‌ని పక్కన పెట్టి ద్విచక్ర వాహనంపై ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. గురువారం మహారాష్ట్ర శాసన మండలికి కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు ఆయన తన నివాసం నుండి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై విధాన భవన్‌కు బయలుదేరారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఆశిష్ షెలార్ మరియు భద్రతా సిబ్బంది కూడా ద్విచక్ర వాహనాలపైనే అనుసరించడం విశేషం. ఈ సందర్భంగా తాను బైక్‌పై వెళ్తున్న ఫోటోలు, వీడియోలను ముఖ్యమంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశం కోసం ఇది తన వంతు సహకారమని, ప్రతి ఒక్కరూ దేశ ప్రయోజనాల దృష్ట్యా తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని స్వయంగా తన కాన్వాయ్‌ను 15 వాహనాల నుండి కేవలం రెండు వాహనాలకు తగ్గించుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని బాటలోనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా పలువురు నేతలు ఇప్పటికే తమ కాన్వాయ్‌లను తగ్గించుకోగా, ఫడ్నవీస్ ఏకంగా బైక్ ప్రయాణాన్ని ఎంచుకుని తన నిబద్ధతను చాటుకున్నారు. మరోవైపు, దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇంధన పొదుపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు మెట్రో స్టేషన్ల మీదుగా నడిచే షటిల్ బస్సులను వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించగా, సామాన్య ప్రజలు కూడా వ్యక్తిగత వాహనాలకు బదులు మెట్రో, బస్సుల్లో ప్రయాణించాలని అధికారులు కోరుతున్నారు. ఇలా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కఠినమైన పొదుపు చర్యలను అమలు చేస్తున్నాయి.

## మూడో దశ 'సర్' అమలుకు

# ఈసీ గ్రీన్ సిగ్నల్

**16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ**

**జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు ● కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన**

**న్యూఢిల్లీ, మే 14:** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా-నగర్ హవేలి- దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

## మద్యం పాలసీ కేసు విచారణ నుంచి తప్పుకున్న

# హైకోర్టు న్యాయమూర్తి

**ఆప్ నేతలకు కోర్టు ధిక్కార నోటీసులు..**

**న్యూఢిల్లీ, మే 14:** ఢిల్లీ మద్యం పాలసీ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలపై కోర్టు ధిక్కార చర్యలకు ఉపక్రమించిన అనంతరం, ఈ కేసు విచారణ నుంచి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకున్నారు. ఈ కేసును ఇకపై వేరే ధర్మాసనం విచారిస్తుందని ఆమె స్పష్టం చేశారు. న్యాయమూర్తులను, కోర్టు విచారణలను కించపరిచేలా సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైకోర్టు అత్యంత తీవ్రంగా పరిగణించింది. న్యాయపరమైన అంశాలను కోర్టులో ఎదుర్కోవాల్సింది పోయి, వాటిని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి న్యాయవ్యవస్థపై వ్యతిరేకతను పెంచేలా ప్రచారం చేస్తున్నారని కోర్టు మండిపడింది. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించినందుకు సమాధానం ఇవ్వాలంటూ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, నేతలు వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లకు కోర్టు ధిక్కార నోటీసులు జారీ అయ్యాయి. రాజకీయ పోరాటాలు ప్రజాక్షేత్రంలో జరగాలని, కానీ న్యాయస్థానాల తీర్పులను, న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు చేస్తుందని కోర్టు హెచ్చరించింది. మద్యం పాలసీ కేసులో ఇప్పటికే రాజకీయ ప్రకంపనలు కొనసాగుతుండగా, హైకోర్టు తీసుకున్న ఈ తాజా నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## చక్కెర ఎగుమతులపై


# కేంద్రం నిషేధం

**ధరల నియంత్రణే లక్ష్యం**

**వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు ఆంక్షలు..**

**తక్షణమే అమల్లోకి ఉత్తర్వులు**

**న్యూఢిల్లీ, మే 14:** దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారతదేశం నుంచి చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. ఈ నిషేధం వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. చక్కెర నిల్వలు తగ్గడం, దేశీయ మార్కెట్‌లో ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో కేంద్రం ఈ ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం ముడి చక్కెర, తెల్ల చక్కెర, శుద్ధి చేసిన చక్కెర సహా అన్ని రకాల చక్కెర ఎగుమతులపై నిషేధం అమలులోకి రానుంది. గతంలో నియంత్రిత విభాగంలో ఉన్న ఎగుమతులను ఇప్పుడు పూర్తిగా నిషేధిత విభాగంలోకి మార్చినట్లు విదేశీ వాణిజ్య నియంత్రణ సంస్థ వెల్లడించింది. ముందస్తు అనుమతులు లేదా లైసెన్సులు ఉన్నా కూడా ఇకపై సాధారణ ఎగుమతులకు అవకాశం ఉండదు. అయితే, యూరోపియన్ దేశాలు, అమెరికాతో ఉన్న ప్రత్యేక కోటా ఒప్పందాల ప్రకారం ఇప్పటికే కుదిరిన పరిమిత ఎగుమతులకు మాత్రం ఈ నిషేధం నుండి మినహాయింపునిచ్చారు. ప్రపంచంలోనే చక్కెర ఉత్పత్తిలో భారత్ రెండో అతిపెద్ద దేశంగా ఉండటంతో, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా దేశాల్లో చక్కెర ధరలు పెరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. దేశీయంగా వినియోగదారులకు ఈ నిర్ణయం ఊరటనిచ్చినప్పటికీ, విదేశీ ఆర్డర్లపై ఆధారపడిన చక్కెర కర్మాగారాలు మరియు ఎగుమతి వ్యాపారులపై దీని ప్రభావం పడవచ్చని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయినప్పటికీ, దేశీయ అవసరాలకే తమ మొదటి ప్రాధాన్యమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.





# ఆర్డీటీ ఓ సంస్థ కాదు.. గొప్ప సేవా వ్యవస్థ

**యువగళం పాదయాత్రలో ఆర్డీటీ సేవలు చూసి చలించిపోయా**

**బత్తలపల్లి ఆస్పత్రి సందర్శన.. ■ మాంచో ఫెర్రర్ కృషీవలుడంటూ ప్రశంసలు**

**శ్రీ సత్యసాయి జిల్లా, మే 14:** ఆర్డీటీ ఓ సంస్థ కాదని.. గొప్ప సేవా వ్యవస్థ అని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆర్డీటీ ద్వారా అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. తాను చేపట్టిన యువగళం పాదయాత్రలో తాను ఆర్డీటీ సేవలు చూశానని.. ఇక్కడ అందుతున్న సేవలు తనను బాగా కదిలించాయని చెప్పుకొచ్చారు. గురువారం ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిని మంత్రి లోకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. తాను చేపట్టిన పాదయాత్ర అనంతపురం దాటినా అనేకసార్లు ఆర్డీటీ గురించి తెలుసుకున్నానని తెలిపారు. గతంలో అనేక ఇబ్బందులు వచ్చాయని పేర్కొన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌తో చాలాసార్లు మాట్లాడి ఫాలో అప్ చేశామని మంత్రి లోకేశ్ తెలిపారు. అద్భుతమైన సేవా కార్యక్రమాలు చేస్తోండటంతో తాను మద్దతు ఇచ్చానని అన్నారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇలాంటి సంస్థలు, ప్రజల కష్టాలు తెలుసుకోవడం కోసమే తాను పాదయాత్ర చేశానని ప్రస్తావించారు. ఆర్డీటీ సంస్థకు సేవ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీకి అందరూ అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని చెప్పుకొచ్చారు. కష్టకాలంలో ఓర్పు, సహనంతో సేవలు చేస్తూ వచ్చిన మాంచోకి ధన్యవాదాలు తెలిపారు. ఆర్డీటీ సేవలు రాయలసీమకే కాదని.. ఏపీకి విస్తరించాలని కోరుకుంటున్నామని అన్నారు. ప్రేమతో సేవ చేయడం మాంచో కుటుంబం ఆశయమని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అంతకుముందు బత్తలపల్లిలో మంత్రి నారా లోకేశ్‌కు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు లోకేశ్‌ను చూడటానికి తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ రాకను పురస్కరించుకొని పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు బాణాసంచా కాల్చారు. బత్తలపల్లి సెంటర్ నుంచి టీడీపీ శ్రేణులతో కలిసి లోకేశ్ భారీ ర్యాలీ తీశారు. అందరికీ అభివాదం చేస్తూ లోకేశ్ ముందుకు సాగారు.

# అల్పపీడన ప్రభావం

**కోస్తాంధ్ర, రాయలసీమలో వర్షాలు**

**16 నాటికి అండమాన్‌లోకి నైరుతి రుతుపవనాలు**

**విశాఖపట్నం, మే 14 (మనసులో మాట):** నైరుతి బంగాళాఖాతం–పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వెల్లడించారు. దీని ప్రభావంతో వచ్చే 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈ నెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లో ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని అధికారులు పేర్కొన్నారు. గురువారం నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 22 వరకు భానుడు తన ప్రతాపాన్ని కొనసాగించే అవకాశముందని హెచ్చరించారు. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా బీర్పూర్‌లో 44.4, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.2, సిద్దిపేట జిల్లా కోహెడలో 43.9, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించారు. వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు ఎక్కువగా ఉండే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఈ వారంపాటు మరింత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.




# వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే'

- ఏపీ కేబినెట్‌లో పొదుపు మంత్రం
- కీలక ప్రాజెక్టులకు ఆమోదం
- వర్క్ ఫ్రమ్ హోమ్, సైకిల్‌పై సచివాలయానికి రావాలని సీఎం పిలుపు
- ఆలస్యంగా వచ్చిన అధికారులపై ఆగ్రహం



**అమరావతి, మే 14:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన పొదుపు చర్యలను రాష్ట్రంలో అమలు చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు. కేవలం కాన్వాయ్‌ల తగ్గింపుతో సరిపోదని, ప్రభుత్వంలో ప్రతి విభాగం పొదుపును పాటించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా వారానికి ఒకరోజు 'నో వెహికల్ డే' పాటించాలని, మంత్రులు సైతం సైకిళ్లు లేదా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, ఈవీ వాహనాలను వాడాలని సూచించారు. కార్యాలయానికి రావాల్సిన అవసరం లేని ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ఇవ్వాలని, కార్ పూలింగ్ విధానాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించారు. మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని, జిల్లా పర్యటనల్లో ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించారు. పొదుపు చర్యలను ప్రజలకు వివరించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుందామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించగా, ముఖ్యమంత్రి అందుకు అంగీకరించారు. మంత్రివర్గ సమావేశానికి సమయానికి హాజరుకాని కార్యదర్శులపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారుల పేర్లు నమోదు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు, రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు సంబంధించి కీలక ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్నూలు ఎయిర్‌పోర్ట్‌ను పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేయడం, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు మరియు బయో గ్యాస్ యూనిట్లకు అనుమతులు మంజూరు చేశారు. విద్యుత్ సంస్థల్లో ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి, అగ్రిగోల్డ్ బాధితుల కేసుల విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించాలని నిర్ణయించారు. శుద్ధ ఇంధనం రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

# 40 అంశాలకు కేబినెట్ ఆమోదం

**రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులకు ఓకే**

**ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులకు అనుమతి**

**ఎపి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు**

**అమరావతి, మే 14:** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 40కి పైగా అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే 25 ప్రాజెక్టులతో పాటు ఉద్యోగాల కల్పనపై కీలక ప్రాజెక్టుల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుద్ధ ఇంధనం, ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, భారీ సోలార్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్, బయోగ్యాస్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. శుద్ధ ఇంధన రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలిపేలా క్యాబినెట్ చర్యలు తీసుకుంది. ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రణాళిక కు ఆమోదం తెలిపింది. డేటా సెంటర్లు, ఆటోమొబైల్, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడుల ఆమోదంపై చర్చించింది. కర్నూలు విమానాశ్రయం పీపీపీ మోడల్‌లో అభివృద్ధి ప్రతిపాదన చర్చకు వచ్చింది. వివిధ సంస్థలకు భూముల కేటాయింపులపై క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఎంఎస్‌ఎంఈలకు నిధుల సౌలభ్యానికి ప్రత్యేక ఏర్పాటుపై చర్చించింది. సాగునీటి కాల్వల విస్తరణ, రోడ్లు, పరిశ్రమలకు మౌలిక సదుపాయాలపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఇకపోతే మంత్రివర్గ సమావేశానికి వివిధ శాఖల కార్యదర్శులు సకాలంలో రాకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన పొదుపుపై మొదటి అజెండాగా చర్చిద్దామని మంగళవారమే సీఎం చెప్పారు. సమావేశంలో అధికారులు లేకపోవడంపై సీఎం ప్రత్యేక



ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. సమాచారం సరిగా ఇవ్వలేదా అని సీఎం ప్రశ్నించగా.. ఇచ్చినట్లు విజయానంద్ సమాధానమిచ్చారు. సమయానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు.

# 'స్థానిక' పోరుకు రంగం సిద్ధం

**ఎన్నికల కమిషనర్ కసరత్తు**

**ఏకీకృత సర్వే ఆధారంగా రిజర్వేషన్లు..**

**90 శాతం స్థానాలే లక్ష్యంగా కూటమి వ్యూహం**

**మున్సిపల్ పాలకవర్గాల పదవీ కాలం ముగింపు..**

**ఎన్నికలకు వెళ్లాలా వద్దా అన్న సంశయంలో వైసీపీ**

**(అమరావతి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేరా ఇప్పటికే ఎన్నికల పూర్వ కార్యకలాపాల పురోగతిని సమీక్షించి, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మార్చి 17తో రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో, ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం సీరియస్ గా దృష్టి సారించింది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నాయని భావిస్తున్న కూటమి ప్రభుత్వం, ఈ ఎన్నికల్లో 90 శాతం సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇప్పటికే నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన సంకేతాలు పంపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుసరించిన ఎన్నికల వ్యూహాలనే కూటమి కూడా పాటిస్తే, అత్యధిక పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ ఖాతాలోకి వస్తాయని నేతలు అంచనా వేస్తున్నారు. మరోవైపు, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో పోటీకి దిగాలా వద్దా అన్న సంశయంలో ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల నిర్వహణలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎప్పుడూ పెద్ద సవాలుగా మారుతోంది. గతంలో బీసీ గణాంకాల విషయంలో తలెత్తిన న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈసారి 'ఏకీకృత కుటుంబ సర్వే' ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సర్వేలో సామాజిక వర్గాల వారీగా స్పష్టమైన గణాంకాలు ఉండటంతో దీనిని ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తున్నారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశించిన 'ట్రిపుల్ టెస్ట్' నిబంధనలను పాటించడం ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.




**ఓటర్ల జాబితా సవరణకు ఆదేశం**

రాష్ట్రంలోని 17 నగర కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలలో ఎన్నికల సందడి మొదలైంది. పదవీ కాలం ముగిసిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కొన్ని మున్సిపాలిటీలు కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ, మిగిలిన చోట్ల వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించి స్థానిక సంస్థలపై పట్టు సాధించాలని కూటమి సర్కార్ కృతనిశ్చయంతో ఉంది.

# స్థానిక ఎన్నికలపై జనసేన కసరత్తు

**నేడు 'సాధక్'లతో పవన్ కల్యాణ్ భేటీ**

**వార్డుల పునర్విభజన, రాజకీయ పరిస్థితులపై నాదెండ్ల మనోహర్ సమీక్ష**

**జిల్లాల వారీ నివేదికల సమర్పణ.. కూటమి వ్యూహాలపై సమగ్ర చర్చ**

**విజయవాడ, మే 14:** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల విజయానంతరం జరగబోయే ఈ ఎన్నికల్లో కూటమి బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని, ముఖ్యంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై పట్టు సాధించాలని పార్టీ వ్యూహరచన చేస్తోంది. ఈ నేపథ్యంలో వార్డుల పునర్విభజన మరియు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన గురువారం కీలక సమావేశం జరిగింది. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కోసం నియమించిన ప్రత్యేక కమిటీలు తమ అధ్యయన నివేదికలను ఈ సమావేశంలో అందజేశాయి. ఉత్తరాంధ్ర నుండి రాయలసీమ వరకు అన్ని జిల్లాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పర్యటించిన ఈ కమిటీలు.. కూటమి బలాబలాలు, వార్డుల పునర్విభజన ప్రభావం, ఓటర్ల ధోరణి మరియు స్థానిక నాయకత్వ పరిస్థితులపై సమగ్ర నివేదికలను సిద్ధం చేశాయి. ఈ నివేదికలను నాదెండ్ల మనోహర్ పరిశీలించి, అనంతరం పవన్ కల్యాణ్‌కు అందజేయనున్నారు. వీటి ఆధారంగానే స్థానిక ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన తుది వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి స్ఫూర్తిని కొనసాగించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని నేతలు నొక్కి చెప్పారు. ప్రజల్లోకి వెళ్లే విధానం మరియు అభ్యర్థుల ఎంపికలో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రాథమిక చర్చలు జరిపారు.

**సాధక్‌లతో పవన్ ఆత్మీయ భేటీ**

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అద్భుత ప్రతిభ కనబరిచిన 'సాధక్'లతో పవన్ కల్యాణ్ శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. 300కు పైగా సభ్యత్వాలు నమోదు చేసిన వారిని గుర్తించి ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. పార్టీ పటిష్టత కోసం గ్రామస్థాయి నుంచి కృషి చేసిన కార్యకర్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో



నిర్వహిస్తున్న ఈ భేటీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఇతర కీలక నేతలు పాల్గొననున్నారు. సభ్యత్వ నమోదుకు లభించిన భారీ స్పందన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని జనసేన వర్గాలు పేర్కొన్నాయి.

# మీ సేవ వాట్సాప్ ద్వారా డీఈఈసెట్ హాల్ టికెట్లు

**హైదరాబాద్ మే14( సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈూణ) విభాగం ఆధ్వర్యంలో డీఈఈసెట్ (Diploma in Elementary Education Common Entrance Test) హాల్ టికెట్లను మీ సేవ వాట్సాప్/చాట్‌బాట్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు మే 15, 2026 ఉదయం 10 గంటల నుంచి వాట్సాప్ ద్వారానే తమ హాల్ టికెట్లను సులభంగా పొందవచ్చు. పరీక్షలు మే 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు.

హాల్ టికెట్ పొందే విధానంఅధికారిక మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096 ను "MeeSeva Telangana" పేరుతో సేవ్ చేసుకోవాలి. వాట్సాప్‌లో "Hi" అని మెసేజ్ పంపాలి. అనంతరం 'DEECET Hall Ticket' అని టైప్ చేయాలి.

మెనూలో కనిపించే 'Open Service' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. పేమెంట్ ఐడి, అప్లికేషన్ నంబర్, మొబైల్ నంబర్, జనన తేది వివరాలను నమోదు చేయాలి. వివరాలు సమర్పించిన వెంటనే హాల్ టికెట్ వాట్సాప్‌లో అందుతుంది. ఈ సేవ ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులకు వేగవంతమైన, భద్రమైన, పారదర్శకమైన పరీక్షా సేవలను అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఐటీ, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి ఐ. ౨ాతీఅఉస్త్రుఘుతీ ధీుఎబ నాయకత్వంలో మీ సేవ పౌర సేవలను మరింత విస్తరిస్తూ ప్రజలకు సౌకర్యవంతమైన డిజిటల్ సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన డిజిటల్ సేవల వేదికగా ఉన్న మీ సేవ, 2025 నవంబర్ 18న ప్రారంభించిన వాట్సాప్/చాట్‌బాట్ సేవలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభించినట్లు తెలిపారు. పుట్టిన తేదీ ధ్రువపత్రాలు, ఆదాయ ధ్రువపత్రాలు, పోలీస్ చలాన్లు, విద్యుత్ బిల్లులు, బీఐఈ ఫలితాల సేవలు ప్రజలు అత్యధికంగా వినియోగిస్తున్న సేవలుగా పేర్కొన్నారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన, సులభమైన డిజిటల్ సేవలను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉ ందని అధికారులు స్పష్టం చేశారు.




కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, న్యూఢిల్లీ కార్యాలయం నుండి, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై శిక్షణ కార్యక్రమం పై అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్స్, జిల్లా కలెక్టర్ల తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.

# వరదల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి




**ములుగు, మే 14( సమయం న్యూస్). :** జిల్లాలో అధిక వర్షపాతం కారణంగా సంభవించే వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఫారెస్ట్ అధికారి వికాస్ మీనాతో కలిసి వరదల నిర్వహణపై టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్, మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ప్రజల తరలింపు, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్, అత్యవసర సేవలు, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మే 15న టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్, మే 18న మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం వివేకానంద కాలనీ, కృష్ణన్ కాలనీ, పల్సాబ్‌పల్లి, ములుగు ప్రాంతాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు పటిష్టంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత, విద్యార్థులకు ఇండియా పోస్ట్ ఫ్రాంచైజీ స్కీమ్ 2.0 అవకాశం

**హైదరాబాద్ మే14( సమయం న్యూస్). :** భారత ప్రభుత్వ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో "ఇండియా పోస్ట్ ఫ్రాంచైజీ స్కీమ్ 2.0" కోసం యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, చిన్న వ్యాపారులు మరియు ఆసక్తి ఉన్న వ్యక్తుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ పథకం ద్వారా స్పీడ్ పోస్టు, పార్సిల్స్ మరియు అంతర్జాతీయ పోస్టల్ ఆర్టికల్స్ బుకింగ్, డెలివరీ సేవల ద్వారా పార్ట్‌టైమ్ ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**అందించే సేవలు:** స్పీడ్ పోస్టు, పార్సిల్ బుకింగ్,పిక్-అప్ సేవలు,డెలివరీ సేవలు,.అంతర్జాతీయ ఆర్టికల్ బుకింగ్.,కమిషన్ ఆధారిత ఆదాయం

**అర్హతలు:**

18 సంవత్సరాలు పైబడిన వారుకనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతస్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ పరిజ్ఞానం

పాన్ కార్డు తప్పనిసరిఎంపికైన అభ్యర్థులను ఇండియా పోస్ట్ ఫ్రాంచైజీలుగా నియమిస్తారని తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 14, 2026 లోపు హైదరాబాద్ సార్టింగ్ డివిజన్‌ను సంప్రదించాలని సూచించారు.

సంప్రదించవలసిన నంబర్: 040-23463880సమయం: ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు.

# మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలం అందించాలి

**కలెక్టర్ కె. హరిత**



**అసిఫాబాద్, మే 14( సమయం న్యూస్). :** వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధ జలాన్ని నిరంతరం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. గురువారం కెరమెరి మండలంలోని ధనోరా గ్రామంలో మిషన్ భగీరథ పంప్ హౌస్‌ను కలెక్టర్ సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. పంప్ హౌస్ నుంచి ఎన్ని మండలాలకు తాగునీరు సరఫరా అవుతోందో, గ్రామాలకు నీరు ఎలా అందుతోందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రతి గ్రామానికి తాగునీరు సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మోటార్లు, పైప్‌లైన్లలో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి సరఫరాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అనంతరం కెరమెరి మండలంలోని కొఠారి కోలం గూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ టి.ఎన్. ప్రకాష్‌రావుతో కలిసి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్ గ్రామానికి 110 ఇండ్లు మంజూరు కాగా, 108 ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. అందులో 7 ఇండ్లు పూర్తయ్యాయని, మిగతా ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. 86 ఇండ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయని వెల్లడించారు. లబ్ధిదారులు తమ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించిన కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రతిరోజూ పనులను పరిశీలిస్తూ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబులు పై నియంత్రణ పెంచాలి, తనిఖీలు నిర్వహించాలి

- అర్హత గల డాక్టర్ లేకుండా నిర్వహిస్తున్న హాస్పటల్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- సిపిఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్




**సమయం న్యూస్ గజ్వేల్ మే 14 :** గజ్వేల్ పట్టణంలో పుట్టగొడుగుల వలె వెలుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలు, ల్యాబ్లపై నియంత్రణ చర్యలు చేపట్టాలని, డాక్టర్స్ లేకుండా నిర్వహిస్తున్న హాస్పిటలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సిపిఐ ఏం పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో సుమారు 100 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు గల్లి గల్లి లో ఉ న్నాయని అనేక ఆసుపత్రిలో డాక్టర్ లేకుండా నర్సులు కాంపౌండర్ లే వైద్యం అందించడం జరుగుతుందని, మందులు రాయడం జరుగుతుందని అన్నారు కొన్ని సందర్భాల్లో వాట్సాప్ ద్వారా చూపిస్తూ వైద్యం చేస్తున్నారని దీంతో ప్రజలకు ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నదని అన్నారు, హాస్పిటల్ తో పాటు ల్యాబ్ పెట్టడంతో అవసరం ఉన్నా లేకున్నా వివిధ రూపాల టెస్టులు రాస్తూ ప్రజల జేబులు ఖాళీ చేస్తున్నారని, ప్రతి ట్రీట్మెంట్ కు ప్యాకేజీలు నిర్ణయిస్తూ ప్రజలకు అత్యవసర వైద్యం అందకుండా చేస్తున్నారని అప్పుల పాలు చేయడం జరుగుతుందని అన్నారు ప్రైవేట్ ల్యాబ్ లో సరైన టెక్నీషియన్స్ లేకుండా పరీక్ష నిర్వహిస్తున్నారని దీంతో రిపోర్టులు తారుమారుగా వస్తున్నాయని అన్నారు. కొన్ని సందర్భాల్లో డాక్టర్లు మరియు ల్యాబ్ ఓనర్లు కలిసిపోయి ప్రజలను లూటీ చేస్తున్నారని అన్నారు ఆస్పత్రులు ఇరుకు గదులు, గాలి సౌకర్యం,అగ్నిమాపక సౌకర్యాలు లేకుండా భవనాలలో ఆసుపత్రులు కొనసాగిస్తున్నారని అన్నారు. జిల్లా పర్యవేక్షణ అధికారులు ప్రైవేట్ డాక్టర్ తో కుమ్మక్కై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరిపి డాక్టర్ లేకున్నా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలో పై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేనిచో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.

# ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఏర్పాట్లకు చర్యలు


- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత




**ఆసిఫాబాద్ మే-14( సమయం న్యూస్,). :** జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కొరకు అవసరమైన ఏర్పాట్లను చేపడ్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరితా అన్నారు గురువారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో న్యూ డిల్లి లోని చీఫ్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ పై నిర్హహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) ముహరాజ్ మార్మాట్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో చేపట్టే ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కొరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు భూత్ స్థాయి అధికారులు సూపర్ వైజర్లను నియమించి శిక్షణ అందిచాలన్నారు రాజకీయ పార్టీల ప్రతినిదులతో సమావేశం ఏర్పాటు చేసి ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయలని రాజకీయ పార్టీల నుండి భూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను తీసుకోవాలన్నారు నెలాఖరు వరకు ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు భూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటింటికి తిరిగి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను చేపడ్తున్నరన్నారు సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు భూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ పారాలు అందిస్తారని ప్రతి ఓటర్ అవసరమైన పత్రాలను జత పర్చి తిరిగి భుత్ స్థాయి అధికారులకు అందజేస్తారని భూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ పారాలు సేకరిస్తారన్నారు సవరణ పక్రియ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమములో ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# గిరిజన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యాను అందిస్తాం

- కలెక్టర్ కే హరిత



**ఆసిఫాబాద్ మే -14( సమయం న్యూస్). :** గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం క్రిందా ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలలో విద్యాను అందిస్తామని కలెక్టర్ కే హరిత అన్నారు గురువారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ అద్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి 3, 5 ,8 తరగతుల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీం క్రిందా లక్కి ద్వారా ఎంపిక కార్యక్రమానికి కలెక్టర్ పాల్గొన్నారు ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన పిల్లలకు బెస్ట్ అవైలబుల్ స్కీం క్రిందా ఉన్నత ప్రమాణాలు కలిగిన పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు విద్యా భోదనను అందిస్తామని కలెక్టర్ అన్నారు మొత్తం 56 సీట్లల్లో పి వి టి జి విద్యార్థులకు 5 సీట్లు ఏజెన్సి విద్యార్థులకు 5 సీట్లు కేటాయించగా మిగిత 46 సీట్ల ను లక్కి డ్రా ద్వారా 3వ తరగతిలో 29 మంది, 5వ తరగతిలో 14 మంది, 8వ తరగతిలో 13 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి , అధికారులు విద్యార్థులు తల్లి దండ్రులు పాల్గొన్నారు

# నారాయణపేట జిల్లాలోని పలు మండలాలలో పిఎ సిఎస్ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను.



**మద్దూర్, గుండుమాల్,కోస్గి,మే,14(సమయం న్యూస్) :** అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను గురువారం పిఎసిఎస్ మద్దూరు, మద్దూరు మండలం,ఐకెపి ధామ్ఘన్‌పూర్,ఎఫ్‌పిఓ చిన్నారం, కోస్గి మండలంపిఎసిఎస్ కోస్గి, పిఎసిఎస్ గుండుమల్, గుండుమల్ మండలం. పర్యటించి రైతులతో మాట్లాడి, సరిగ్గా శుభ్రం చేసిన వరిని పిపిసిలకు తీసుకురావాలని వారికి సూచించారు. అలాగే రికార్డులను సరిచూసి, వరి సేకరణను వేగవంతం చేయాలని, వరి నిల్వలను వెంటనే తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, రైతులకు సకాలంలో ఎంఎస్‌పి చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని కూడా ఆదేశించారు. అంతేకాకుండా, శ్రీ ఇండ్స్ జాదవరావుపల్లి మరియు వెంకట సాయి పిబిఆర్ఎం కోస్గిని సందర్శించి, మిల్లు వద్ద వరి అన్‌లోడింగ్ ప్రక్రియను సమీక్షించాను. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వరి వాహనాల నుండి సరుకును వేగంగా దించేందుకు హమాలీల సంఖ్యను పెంచాలని యాజమాన్యానికి సూచించారు..

# కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- నారాయణపేట జిల్లా అధికారులకు ఎంపీ డీ కే అరుణ దిశా నిర్దేశం.





**నారాయణపేట,14(సమయం న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, అర్హులందరికీ ఆయా పథకాలను లబ్ధి చేకూర్చాలని పాలమూరు ఎంపీ, దిశ కమిటీ చైర్ పర్సన్ డీ కే అరుణ అన్నారు. గురువారం నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి,సమన్వయ మరియు పర్య వేక్షణ కమిటీ (దిశ) మూడవ సమావేశం పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీ.కే. అరుణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి పాల్గొన్నారు.సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో,కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సమావేశంలో సమీక్షించారు. మొత్తం 45 ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర ,రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీ డీకే అరుణ అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా క్షేత్ర స్థాయిలో సక్రమంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లోటు పాట్లు ఉంటే సరి చేసుకుని పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగపడేలా సమావేశంలో సమీక్షించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని,జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని అధికారులకు ఆమె సూచించారు. కేంద్రం ప్రభుత్వ నిధులు,రాష్ట్ర వాటా నిధులతో అమలు చేస్తున్న కేంద్ర పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యత వహించాలని అన్నారు. జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ సమావేశం మూడు నెలల కొక సారి నిర్వహించి కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులతో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు సమీక్షించి విజయవంతంగా అమలు చేసి ప్రజలకు లబ్ది చేకూరేలా సమావేశంలో చర్చించి సంబంధిత శాఖల ద్వారా పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పథకాలు,కార్యక్రమాల అమలులో లోపాలు ఉంటే సవరించుకొని ఎవరికి చేరాలో వారికి లబ్ధి జరిగినప్పుడు లక్ష్యం నెరవేరుతుందన్నారు.సమావేశం లో గత సమావేశంలో చర్చించిన అంశాలపై ఆయా శాఖలు తీసుకున్న చర్యా నివేదిక పై చర్చించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ ,,వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, గృహ నిర్మాణ,పంచాయతీ రాజ్,విద్యా శాఖ, డీ డబ్ల్యు ఓ, ఎస్సీ అభివృద్ధి, ఆర్ డబ్లు ఎస్, పౌర సరఫరాల శాఖ, నాబార్డు, మైనింగ్ శాఖ, పశు సంవర్ధక, మత్స్యశాఖ, భూగర్భ జల వనరుల శాఖ, జిల్లా మార్కెటింగ్, చీఫ్ ప్లానింగ్, ఉద్యాన శాఖ, ఇరిగేషన్, కార్మిక శాఖ, నేషనల్ హైవే,ఆర్‌డబి, తంతి తపాల( పోస్టల్), జిల్లా పరిషత్, ఎల్ డి ఎం, డీ ఎఫ్.ఓ, డీ వై ఎస్.వో, ప్రజా ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ లు, మిషన్ భగీరథ, చేనేత జౌళి శాఖ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.తొలుత జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి జిల్లాలో 272 గ్రామ పంచాయతీలకు గాను 201 గ్రామాల్లో సొంత పంచాయతీ కార్యాలయ భవనాలున్నాయని, మిగతా 71 పంచాయతీలకు సొంత భవనాలు లేవని తెలిపారు. స్పందించిన ఎంపీ అరుణ ఇప్పటికీ సొంత పంచాయతీ కార్యాలయ భవనాలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో చాలా మంది సర్పంచులు చేసిన పనులకు నేటికి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఆయుష్ మాన్ భారత్ కింద జిల్లాలో ఇప్పటివరకు 2533 మంది వివిధ శస్త్రచికిత్సలు చేసుకుని 5 నుంచి 10 లక్షల లోపు లబ్ధి పొందారని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో వైద్యులు ఉన్నారా లేదా అని ఎంపీ ఆరా తీశారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలను జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ పీఎం కిసాన్ యోజన పథకం లబ్ధినీ, ఎరువుల సబ్సిడీ ద్వారా ఇప్పటివరకు కేంద్రం 207 కోట్ల ను చెల్లిందని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డ్ లు శాంపిల్స్ తీసి రైతులకు కార్డులు పంపిణీచేస్తున్నట్లు వివరించారు. ఎంపీ.డి. కె అరుణ స్పందిస్తూవ్యవసాయ యాంత్రీకరణ పథకం లో వచ్చిన దరఖాస్తులు నుండి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా పెద్ద రైతుల కు కాకుండా చిన్న సన్న కారు రైతులకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద 134 దరఖాస్తులు వచ్చినట్టు విద్యుత్ శాఖ ఎస్.ఈ. నవీన్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కేంద్రం వాటా గురించి తెలిపిన ఎంపీ అరుణ ఇండ్ల మంజూరి నీ పార్టీలకు అతీతంగా చేయాలని హౌసింగ్ పీడీ శంకర్ నాయక్ ను ఆదేశించారు. జిల్లాలో 19 పీఎం శ్రీ స్కూళ్లు ఉన్నాయని, కేంద్రం నుంచి మంజూరైన నిధులను విద్యా శాఖ 90 శాతం వినియోగించుకున్నట్లు విద్యా శాఖ అధికారి గోవింద రాజులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ శాఖకు నిధులు మంజూరైనా.. ఎలాంటి అభివృధి కార్యక్రమాల శంకుస్థాపన/ ప్రారంభోత్సవాలు ఉన్నా ఖచ్చితంగా తన సమయం తీసుకుని చేయాలని ఎంపీ అరుణ ఆదేశించారు. ధన్వాడ లో డిగ్రీ కళాశాల భూమిపూజ ఎవరిని అడిగి చేశారని ఎంపీ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అసలు డిగ్రీ కళాశాల నిర్మించాల్సిన స్థలం ఆక్రమణ కు గురైందని, తక్కువ స్థలంలో కళాశాల కట్టాలని చూస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఒకరిద్దరి సంతోషం కోసం కాలేజీ కట్టడం తప్పు అని ఆమె హితవు పలికారు. మహిళా శిశు వికలాంగుల వయో వృద్ధుల శాఖలో మొత్తం మూడు నారాయణపేట, మక్తల్, మద్దూరు ప్రాజెక్టుల పరిధిలో 704 అంగన్ వాడీ కేంద్రాలున్నాయని, వాటిలో 132 కేంద్రాలకు సొంత భవనాలున్నాయని, 273 వివిధ ప్రభుత్వ భవనాలలో కొనసాగుతుండగా, మిగతా 299 అంగన్ వాడీ కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని ఐ సీ డి ఎస్ సూపర్ వైజర్ తెలిపారు. జిల్లాలో ఎన్ని అంగన్ వాడీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంపీ ప్రశ్నించగా 33 అంగన్ వాడీ టీచర్ పోస్టులు, 203 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని సూపర్ వైజర్ తెలిపారు. ఇక మిషన్ భగీరథ పథకం ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందా లేదా? వేసవిలో ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని ఎంపీ మిషన్ భగీరథ ఈ.ఈ నీ ఆదేశించారు. ఉజ్వల పథకం కింద కొత్తగా ఎవరైనా గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్నారా అని సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్ ను ప్రశ్నించిన ఎంపీ 300 గ్యాస్ సబ్సిడీ అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అయితే కేంద్రం ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నా... రేషన్ దుకాణాల్లో మాత్రం కేవలం సీఎం రేవంత్ రెడ్డి ఫోటో మాత్రమే పెడుతున్నారు!.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోటో ఎందుకు పెట్టడం లేదని సివిల్ సప్లై అధికారినీ ఎంపీ అరుణ నిలదీశారు. రేషన్ బియ్యం లో కేంద్రం వాటా లేదా అని ప్రశ్నించారు.ఇకపై రేషన్ దుకాణాల్లో సీఎం ఫోటో తో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోటో ఉండాల్సిందేనని ఎంపీ తేల్చి చెప్పారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు నిరుద్యోగ యువత చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటు కు అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు అవశ్యకత ను వివరించారు. పశు సంవర్ధక శాఖ లో ఎన్ ఏ ఐ పి, గాలికుంటూ వ్యాధి టీకాల 8వ విడత కొనసాగుతోందని ఆ శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ - నామ్ మార్కెట్ వల్ల మార్కెట్ యార్డులో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి ధరలు బాగా వస్తున్నాయని డీ ఎం వో బాలామణి చెప్పారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ తోటల సాగు గురించి అధికారి సాయిబాబా తెలుపుతూ.. ఈ సారి 2 వేల ఎకరాల సాగు లక్ష్యాన్ని చేరుకుంటాం అన్నారు. జిల్లా లో 10 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తే జిల్లాలోనే మిల్లు ఏర్పాటుకు అవకాశం వస్తుందన్నారు. కోటకొండ - కోయిల కొండ మధ్యలో రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయని, జిల్లాలో ఎన్.హెచ్. విస్తరణ కు ఏమైనా ప్రతిపాదన లు ఉన్నాయా అని ఎంపీ అధికారులను ప్రశ్నించారు. బ్యాంకర్లు రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలని, మిగతా టార్గెట్ లను పూర్తి చేయాలని ఎల్.డి ఎం కు ఆమె సూచించారు. వన మహోత్సవశీలో నాటిన మొక్కలు పెరిగాయా ? మొక్కలను ఎక్కడ నాటారని ఎంపీ ప్రశ్నించగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటడం జరిగిందని అధికారి జవాబు ఇచ్చారు. ఉట్కూర్, మక్తల్ ప్రాంతాల్లో పంట పొలాల్లో జింకల సంచారం అధికంగా ఉందని సమస్య కు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఆమె సూచించారు. జిల్లాలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని ఎంపీ ప్రశ్నించగా.. ఓటరు జాబితా తయారు చేస్తున్నామని సహకార సంఘాల ఎన్నికలు త్వరలోనే నిర్వహించే ఏర్పాట్లు జరుగుతున్నాయని చేనేత జౌళి శాఖ అధికారి బాబు తెలిపారు. జిల్లా కేంద్ర మున్సిపాలిటీ లో 27.66 కోట్లతో చేపట్టిన వాటర్ ట్యాంకుల నిర్మాణం ఎంతవరకు వచ్చిందని ఎంపీ అరుణ ప్రజా ఆరోగ్య శాఖ అధికారి నీ ప్రశ్నించారు. జిల్లా కేంద్రం లోని ఎర్రగుట్ట, టీవీ టవర్ వద్ద 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు పెద్ద వాటర్ ట్యాంకుల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయని, అలాగే 5 లక్షల లీటర్ల ట్యాంకు నిర్మాణం ప్రారంభం అవుతోందని అధికారి వివరించారు. చివరగాజిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక మాట్లాడుతూ...దిశ సమావేశంలో శాఖల వారీగా చర్చించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని,ఆయా శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలు లక్ష్యం మేరకు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖలు చేపట్టే పనులు ప్రారంభించినప్పుడు ప్రోటోకాల్ తప్పక పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దిశ కమిటీ సభ్యులు,అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎస్. ఈ లు, డీ. ఈ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో సి. పి. డి. సి సమావేశం

- డిగ్రీకాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన...
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న సి.పి.డి.సి సభ్యులు డాక్టర్. సాకేత్.



**కొడంగల్ మున్సిపల్, మే,14(సమయం న్యూస్) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక, విద్యా వారోత్సవాల్లో భాగంగా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల సి. పి. డి. సి (కాలేజ్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ సమావేశం ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధిలో సామాజిక వేత్తల్ని, స్థానిక నిపుణులను మరియు తల్లిద ండ్రులను భాగస్వాములను చేయడమే సి. పి. డి. సి ముఖ్య ఉద్దేశ్యమని, ఇది ప్రధానంగా కళాశాల మౌలిక సదుపాయా లను మెరుగుపరచడం, విద్యా నాణ్యత ప్రమాణాల పెంపు మరియు వనరుల సమీకరణపై దృష్టి పెడుతుందన్నారు. ఈ సమావేశంలో కళాశాల సాధించిన విజయాలు, మరింత అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గూర్చి చర్చించారు. కళాశాల అభ్యున్నతిని మరింత జనబాహుళ్యం లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాలలో కాంపిటీటివ్ సెల్ విస్తరణ, నైపుణ్య ఆధారిత కోర్సుల సంఖ్య పెంచడం, వివిధ పరిశ్రమలతో అవగాహనా ఒప్పందాల వల్ల విద్యార్థు లలో నైపుణ్య శిక్షణ, ఉద్యోగ సన్నద్ధతకు ఆస్కారం ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈరోజు ఇంకా తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం, పూర్వ విద్యార్థుల సమావేశం ఆన్లైన్ లో నిర్వహించడం జరిగింది. ఇంకా కళాశాల పూర్వ విద్యార్థి టి. రమేష్ ను సన్మానించారు. సి. పి. డి. సి సభ్యులు డా. సాకేత్, ఠాకూర్ బలరాం సింగ్, రఫియా ఖానం టి. రాంబాబు, డా. ఆర్. శ్రీనివాస్, డా. కె. రమేష్ బాబు, డా. ఇ. సోమ్లా, హరిప్రియ పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ -- ఫేజ్ -3 పనులను వేగవంతం చేయాలి

**హైదరాబాద్, మే 14( సమయం న్యూస్) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ఫేజ్-3 కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఎన్నికల అధికారులు సూచించారు. ఓటరు జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, మార్పులు పారదర్శకంగా చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డూప్లికేట్, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను పరిశీలించి తగిన మార్పులు చేయాలని పేర్కొన్నారు.ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను సమయానికి పూర్తి చేసి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

**న్యూఢిల్లీ, మే 14 (సమయం న్యూస్):** భారత ఎన్నికల సంఘం 2026 అక్టోబర్ 1ను అర్హత తేదీగా నిర్ణయిస్తూ ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను విడుదల చేసింది.ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ముందే నింపబడిన నమోదు ఫారమ్‌లను ఓటర్లకు అందజేసి, వాటి పూర్తి విధానంపై అవగాహన కల్పించనున్నారు.జూలై 31న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న విడుదల చేయనున్నారు.కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం-6, వివరాల సవరణ లేదా చిరునామా మార్పు కోసం ఫారం-8 సమర్పించవచ్చని అధికారులు తెలిపారు. ఇంటింటి సర్వే సమయంలో ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన ఫారమ్‌లను దీూాల సహకారంతో సమర్పించాలని ప్రధాన ఎన్నికల అధికారి కోరారు.

# చారిత్రక పరిశోధన ఆధారిత నవలలు రావాలి

**కొండమల్లు నవల కొత్త ఎడిషన్ అందుకున్న కేటీఆర్**



**హైదరాబాద్ మే14( సమయం న్యూస్) :** సుసంపన్నమైన చరిత్ర కలిగిన తెలంగాణలో చారిత్రక, సామాజిక అంశాలను కొత్త దృష్టితో స్పృశించే నవలలు, ఆవిష్కరణలు మరిన్ని రావాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు. చెంచుల జీవనం, సంస్కృతిని ప్రతిబింబించేలా నవలను రాయటం అభినందనీయమని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరి గురించి చెప్పాలో.. ఎవరి గొంతుకై నినదించాలో.. రచయిత సరిగ్గా దాన్ని అందుకున్నారని కేటీఆర్ కొనియాడారు. గురువారం నంది నగర్ లోని తన నివాసంలో ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, కోణతం దిలీప్, జర్నలిస్టు సంఘం నాయకుడు ఆస్కాని మారుతిసాగర్, జర్నలిస్టు తిరుపతి నాయక్ తదితరులు కలిసి రచయిత వర్దెల్లి వెంకటేశ్వర్లు 'కొండమల్లు' నవల నూతన ఎడిషన్‌ను కేటీఆర్‌కు అందజేశారు.తమ రాజధానిని విస్తరించుకునే ప్రయత్నంలో బ్రహ్మనాయుడు సైన్యం చెంచు నివాసాలపై దాడి చేయడాన్ని ఎదురించే ఈ కథ, చెంచు నాయకుడైన బయ్యన్న చుట్టూ తిరుగుతుంది. అధికార బలం, సైనిక బలగంతో ఉన్న బ్రహ్మనాయుడుతో నేరుగా తలపడలేక తన ప్రతీకార యాత్రలో భాగంగా "కారుకోడి" అనే ఒక ప్రత్యేక జాతి కోడిపుంజును పట్టుకుని, దానిని "కొండమల్లు"గా మారుస్తాడు. 800 ఏళ్ల పురాతన పలనాటీ సీమ చరిత్ర, చెంచుల సామాజిక అంశాలపై జరిపిన పరిశోధన ఆధారంగా ఒక నూతన దృక్కోణంతో రచించిన నవల ఇతివృత్తాన్ని గురించి ప్రజాకవి గోరటి వెంకన్న కేటీఆర్‌కు వివరించారు. తెలంగాణలోని నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, గుంటూరు, కర్నూల్, ప్రకాశం జిల్లాల్లో విస్తరించి ఉన్న నల్లమల అడవి, చెంచుల జీవితం, సంస్కృతి, వారి ప్రస్తుత అవసరాల గురించి కూడా కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ నేపథ్యం ఉన్న చారిత్రక అంశాల మీద పరిశోధించి నవల రాయాలని ఈ సందర్భంగా కేటీఆర్ సూచించారు.

# చెక్పోస్టుల వద్ద విధులను నిర్వర్తించే సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

- జూలూరుపాడు వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్పోస్ట్ ను తనిఖీ చేసి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**జూలూరు పాడు మే14( సమయం న్యూస్) :** రాబోయే బక్రీద్ పండుగ దృష్ట్యా పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి,శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్పోస్టును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఇతర ప్రాంతాల సరిహద్దుల నుండి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని,ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని కోరారు.ఎవరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు.ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



**మల్కాజ్ గిరి మే14( సమయం న్యూస్) :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కరెంట్ షాక్‌కు కృష్ణ లనే వ్యక్తి మృతి చెందిన్నట్లు సిఐ . భాస్కర్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, కృష్ణ బుధవారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఇంటి బాల్కనీలో ఏర్పాటు చేసిన ఐరన్ ఎయిర్ కూలర్‌లో నీరు నింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ కూలర్‌కు విద్యుత్ ప్రవాహం ఉ ండటంతో కరెంట్ షాక్‌కు గురయ్యారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఆయనను బయటకు తీసే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే కృష్ణ అపస్మారక స్థితిలో కిందపడిపోయారు తక్షణమే కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ సహాయంతో ఆయనను పోలోమి ఆసుపత్రికి తరలించగా, విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులు సెకండ్ ఒపీనియన్ కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా, అక్కడ కూడా వైద్యులు పరిశీలించి కృష్ణ మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుని కుమారుడు మనీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కుషాయిగూడ ూనూ ఎల్. భాస్కర్ రెడ్డి తెలిపారు

# తెలంగాణలో పర్యాటక ఉత్సవాలు ప్రారంభం

- మే 18 నుంచి 24 వరకు థీమ్-10 వారోత్సవాలు



**హైదరాబాద్, మే 14 (సమయం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా మే 18 నుంచి 24 వరకు పర్యాటక, సాంస్కృతిక వారోత్సవాలను నిర్వహించనుంది. పర్యాటక శాఖ, హెరిటేజ్ శాఖ, భాషా సాంస్కృతిక శాఖల సమన్వయంతో హెరిటేజ్ వాక్స్, టూరిజం యాక్టివేషన్ డ్రైవ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజియం వేడుకలు, యువతకు కెరీర్ గైడెన్స్ వర్క్‌షాపులు నిర్వహించనున్నారు. మే 23న హైదరాబాద్‌లో "టూరిజం కాన్‌క్లేవ్ 2026 -- డెస్టినేషన్ తెలంగాణ" సదస్సు జరగనుండగా, చివరి రోజు రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టనున్నారు. "తెలంగాణ జరూర్ ఆనా" సందేశంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

# బీ ఆర్ ఎస్ పార్టీ లో వికలాంగుల విభాగం ఏర్పాటు చెయ్యాలని,

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేసిన,
- బీ వీ హెచ్ పీ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు.



**వికారాబాద్, మే,14(సమయం న్యూస్) :** భారత రాష్ట్ర సమితి పార్టీలో వికలాంగుల విభాగం ప్రత్యేకంగా ఏర్పాటు చెయ్యాలని,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి హైదరాబాద్ లోని ఆమె నివాసంలో కలిసి వినతి పత్రం అందజేసిన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు. ఈ సందర్భంగా కావలి నర్సిములు మాట్లాడుతూ ,కాంగ్రెస్ ప్రభుత్వంలో వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లలో 5% రిజర్వేషన్ అమలు చెయ్యడం లేదన్నారు, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆసరా పెన్షన్ ల పెంపు జరుగలేదని, తెలంగాణ వ్యాప్తంగా సుమారుగా 40 లక్షల మంది వికలాంగులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులు కేవలం ఓట్ల వరకే పరిమితమా, అని డిమాండ్ చేశారు. అర్హులైన వికలాంగులకు త్రీ వీలర్ మోటార్ బైక్ లు ఇవ్వడం లేరు,త్రీ వీలర్ బైక్ ల విషయంలో పైరవీలు చేస్తున్నారని మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు, మా న్యాయ పరమైన డిమాండ్ల పరిష్కారం కోసం,మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ ను మా సంఘం రాష్ట్ర ప్రతినిధులతో కలిపించే ప్రయత్నం చెయ్యగలరని విజ్ఞప్తి చేశారు.

# ఫార్ములా ఈ-రేస్ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

**హైదరాబాద్, మే 14 (సమయం న్యూస్):** ఫార్ములా ఈ-రేస్ నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్థిక అక్రమాల కేసులో మాజీ మంత్రి K. T. Rama Rao (కేటీఆర్), సీనియర్ ఐఏఎస్ అధికారిూతీజఱఅఅ ఖబఝతీ, మాజీ హెచ్‌ఎం డీఏ చీఫ్ ఇంజనీర్ దీ. ూ. చీ. =వసఎలకు ఏసీబీ కోర్టు గురువారం సమన్లు జారీ చేసింది. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ సందర్భంగా విదేశీ సంస్థకు సుమారు రూ.55 కోట్ల బదిలీలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఈ కేసు నమోదైంది. ఈ కేసులో జూలై 31న కోర్టులో హాజరు కావాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఈ కేసుకు సంబంధించిన చార్జ్‌షీట్‌ను దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించింది. సమాచారం ప్రకారం, చార్జ్‌షీట్‌లో కేటీఆర్‌ను ూ1గా, అరవింద్ కుమార్‌ను ూ2గా, బీఎల్ఎన్ రెడ్డిని ూ3గా, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావును ూ4గా, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఖీజూూ) సంస్థను ూ5గా పేర్కొన్నట్లు తెలిసింది..

# ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల మే 14( సమయం న్యూస్) :** రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యంను కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండల కేంద్రంలో హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల తహసిల్దార్లు పుష్పలత, దిలీప్ కుమార్ లతో కలిసి రాజరాజేశ్వర రైస్ మిల్ ను సందర్శించి ప్రక్రియ పరిశీలించిన అనంతరం గాయత్రి రైస్ మిల్ లో ఏర్పాటు చేసిన గోదామును కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి జిల్లాలో గుర్తించిన గోదాములలో నిల్వ చేసి కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా గోదాములలో నిల్వ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో లారీలు, హమాలీల కొరత, సమస్య లేకుండా ధాన్యం దిగుమతి త్వరగా పూర్తిచేసే విధంగా రైస్ మిల్లులు, లారీల యజమానులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, గోదామును దండేపల్లి మండల తహసిల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలి

- కలెక్టర్ చిత్రా మిశ్రా
- పకడ్బందీ బందోబస్తు చర్యలు చేపడుతున్నాం..
- సీపీ గౌష్ ఆలం..
- బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం




**కరీంనగర్ మే14( సమయం న్యూస్) :** బక్రీద్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. బక్రీద్ పండుగ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో పాటు ముస్లిం మత పెద్దలతో బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, జిల్లా స్థాయి అధికారులు, ముస్లిం మత పెద్దలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ముస్లిం మత పెద్దల సూచనలు, సలహాలను స్వీకరించి అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు. బక్రీద్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పని చేయాలని కలెక్టర్ సూచించారు. పశువుల అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈద్గాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నమాజ్ సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మసీదుల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వేస్ట్ కవర్లను పంపిణీ చేయాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సమయానికి నీరు అందేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నగరంలో పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహిస్తూ పండుగను సామరస్య వాతావరణంలో నిర్వహించుకు నేలా చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డి శ్రీనివాస్ రెడ్డిఅడిషనల్ డీసీపీ వెంకటరమణ ఆర్డీవోలు కే మహేశ్వర్ రమేష్ బాబు, జిల్లాస్థాయి అధికారులు ముస్లిం మత పెద్దలు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీల భద్రత, ప్రజల అవసర కీలకం

## కుషాయిగూడ పోలీసుల కమ్యూనిటీ సమావేశంలో

## ఏసీపీ వెంకట్ రెడ్డి ఏసీపీ వెంకట్ రెడ్డి




**మల్కాజ్ గిరి మే14( సమయం న్యూస్) :** కాలనీల భద్రత, ప్రజల అవసరం కీలకం అన్ని ఏసీపీ వెంకట్ రెడ్డి ఏసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రెసిడెంట్లతో కుషాయిగూడ పోలీసులు కమ్యూనిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ వెంకట్ రెడ్డి హాజరై కాలనీల భద్రత, ప్రజల అప్రమత్తతపై పలు కీలక సూచనలు చేశారు సమావేశంలో సైబర్ క్రైమ్‌లు, యాంటీ డ్రగ్స్ అవగాహన, మేడ్ సర్వెంట్ల నిర్వహణ, రోడ్డు భద్రత, మహిళల రక్షణతో పాటు వేసవి కాలంలో పెరుగుతున్న దొంగతనాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్థానిక ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ భాస్కర్ రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు వివిధ అంశాలపై మాట్లాడారు. ఎస్సైలు సాయిలు, సుధాకర్ రెడ్డి, వెంకన్న, సతీష్, విజయ్, సీడీఈడబ్ల్యూ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

**చర్లపల్లిలో........** సన్‌షైన్ కంపెనీలో మహిళా భద్రతపై



ఒక అవగాహన కార్యక్రమాన్ని చర్లపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఏ. సుధాకర్ ఈ కార్యక్రమంలో 100, 112 మరియు 181 (మహిళా హెల్ప్‌లైన్) నంబర్లకు డయల్ చేయడం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించడంతో పాటు, వేధింపులు మరియు దుర్భాషలను సంకోచం లేకుండా నివేదించడం, అత్యవసర నంబర్లను భద్రపరచుకోవడం, పరిసరాల పట్ల అప్రమత్తంగా ఉండటం మరియు మొబైల్ ఫోన్ల వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 40 మంది మహిళా ఉద్యోగులు హాజరైనట్లు తెలియజేశారు.

# ధ్వని కాలుష్యంపై పోలీసుల నజర్

## ఒక్కరోజులో 451 కేసులు నమోదు.. రూ.6.14 లక్షల జరిమానా

**మల్కాజిగిరీ మే14( సమయం న్యూస్) :** నగరంలో పెరుగుతున్న ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు బుధవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి, అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకున్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ పర్యవేక్షణలో కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 451 వాహనాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు, సంబంధిత వాహనదారులపై మొత్తం రూ.6,14,000 జరిమానా విధించారు. అదనంగా, 76 వాహనాలకు అమర్చిన అనధికారిక మాడిఫైడ్ సైలెన్సర్లను అక్కడికక్కడే తొలగించారు మోటారు వాహన చట్టం ప్రకారం అనుమతించిన సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని పోలీసులు స్పష్టం చేశారు. అనధికారిక సైలెన్సర్ల నుంచి వెలువడే అధిక శబ్దాలు రోగులు, వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. ఇటువంటి శబ్ద కాలుష్యం ప్రజా ప్రశాంతతకు భంగం కలిగించడమే కాకుండా రహదారి భద్రతకూ ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని, వాహనాలకు అమర్చిన అదనపు లేదా అనధికారిక సైలెన్సర్లను వెంటనే తొలగించుకోవాలని మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సూచించారు.

# చేప ప్రసాదం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మే 14( సమయం న్యూస్) :** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8న నిర్వహించనున్న చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు వాకిటి శ్రీహరి, మొహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఆయన ఏర్పాట్లపై సమీక్షించారు. మృగశిర కార్తి సందర్భంగా 24 గంటల పాటు జరిగే ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో ఆస్తమా బాధితులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, క్యూ లైన్లు, షెడ్లు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిక్‌పాకెటింగ్, చోరీలు, చైన్ స్నాచింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులకు ఆదేశించారు. అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని, ఫిషరీస్ అధికారులు నాణ్యమైన



చేపలను తగినంతగా సిద్ధం చేయాలని సూచించారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, 1847లో ప్రారంభమైన చేప ప్రసాదం పరంపర 179 ఏళ్లుగా ప్రజల విశ్వాసంతో కొనసాగుతోందన్నారు. మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, ఇది అన్ని వర్గాల ప్రజలు విశ్వాసంతో పాల్గొనే కార్యక్రమమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక అలా, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, వివిధ శాఖల అధికారులు, బత్తిని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలును వేగవంతం చేయాలి

## ● జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**అదిలాబాద్ మే14( సమయ్దం న్యూస్) :** జిల్లాలో రైతులు పండించిన జొన్న పంటను త్వరితగతిన కొనుగోలు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, వ్యవసాయ, రవాణా శాఖల అధికారులతో కలిసి జొన్నల కొనుగోలుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జొన్న పంటను త్వరితగతిన కొనుగోలు చేసి, రైతులకు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించడంతో పాటు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జొన్నల రవాణా ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు రాకుండా వాహనాల లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, హమాలీల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు విక్రయించిన పంటకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ప్రభుత్వంపై మరింత విశ్వాసం కల్పించాలని పేర్కొన్నారు. అంతకుముందు



అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. స్టాక్ పాయింట్లు, తూకం యంత్రాల పనితీరును తనిఖీ చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశం, పరిశీలనలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రాధాన్యత

## ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ మే14( సమయం న్యూస్) :** మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ నగరం లోని పిల్లల మర్రిలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించబడినట్లు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సుమారు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయగా, అందులో భాగంగా ఈరోజు రూ.2 .5 కోట్ల వ్యయంతో పలు పనులకు శంకుస్థాపన నిర్వహించినట్లు తెలిపారు. మయూరి పార్క్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా ట్రెక్కింగ్ ట్రైల్స్, వ్యూ పాయింట్లు, టూరిస్టుల కోసం తాత్కాలిక కాటేజీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఫారెస్ట్ ఏరియా పరిమితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు జరుగుతాయని ఆయన తెలిపారు. అలాగే కురుమూర్తి, మన్నెంకొండ, , పిల్లమర్రి వంటి ముఖ్య ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. వచ్చే సంవత్సరం నిర్వహించనున్న కృష్ణ పుష్కరాల దృష్ట్యా జిల్లాలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సుమారు 150 పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి కూడా వాటిని ఆమోదిస్తూ జిల్లాలోని ప్రధాన దేవాలయాలన్నింటినీ అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. మహబూబ్ నగర్ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా కార్యరూపంలో పనిచేస్తోందని, గతంలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దుతూ వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు





చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో సమగ్ర అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, 1 వ డివిజన్ కార్పొరేటర్ దేప్లీ మేఘ్యానాయక్, కార్పొరేటర్లు ప్రశాంత్, రమేష్ రెడ్డి, తిరుమల వెంకటేష్, నాయకులు వర్ధ రవి, అశ్వాక్, హకీం, కాటం రాజు, జిల్లా పర్యాటక అధికారి జె రాజశేఖర్ రెడ్డి,టి.ఎస్.టి.డి. సి డి.ఈ పర్షవేది, పాల్గొన్నారు.

# గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు తెలంగాణకు గర్వకారణం

## డి జి పి

**హైదరాబాద్, మే 14 (సమయం న్యూస్):** గ్రేహౌండ్స్ దళాల సందర్శన అనంతరం డీజీ ఆపరేషన్స్‌తో కలిసి ఇబ్రహీంపట్నంలోని ఆక్టోపస్ ఫోర్స్ క్యాంపస్‌ను సందర్శించినట్లు తెలంగాణ డీజీపీ తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై వారి పనితీరు, శిక్షణ, ఉగ్రవాద ఘటనలు మరియు హౌస్ ఇంటర్‌సెప్షన్ వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతపై సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. దళాల సౌకర్యాలు, కొత్త భవనాలను కూడా పరిశీలించినట్లు తెలిపారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు దేశవ్యాప్తంగా తెలంగాణకు గర్వకారణమని, ఈ రెండు బలగాలకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతు అందిస్తుందని డీజీపీ స్పష్టం చేశారు.


# బీసీ గురుకుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు





**హైదరాబాద్, మే 14( సమయం న్యూస్) :** బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ కొమురంభీం భవన్‌లో బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 2025-26 విద్యా సంవత్సరంలో 508 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానిస్తున్నామని తెలిపారు. ఎంజేపీ గురుకులాలు పదో తరగతిలో 98.99 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి పూర్తి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

# జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశానుసారం



**వికారాబాద్, మే,14(సమయం న్యూస్) :** జిల్లాలోని పోలీస్ అధికారులు రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వివిధ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు (బ్రాజలు) మరియు రైస్ మిల్లులను విస్తృతంగా సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సక్రమంగా కొనుగోలు చేయించే దిశగా పోలీస్ శాఖ అన్ని విధాల సహకారం అందిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, మధ్యవర్తుల జోక్యం లేకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధిక రద్దీ, ట్రాఫిక్ సమస్యలు, ధాన్యం రవాణాలో జాప్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ స్థాయి అధికారులకు సూచనలు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్ మరియు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన తనిఖీలలో భాగంగా తాండూర్ డీఎస్పీ కాశింపూర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిగి డీఎస్పీ సుల్తాన్‌పూర్ కొనుగోలు కేంద్రం మరియు శ్రీ వెంకట సాయి రైస్ మిల్లును తనిఖీ చేసి నిల్వలు, తూకం ప్రక్రియ, రవాణా సౌకర్యాలను పరిశీలించారు. దౌల్తాబాద్ ఎస్.హెచ్.ఓ గోక ఫసల్వాద్‌లోని రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వ పరిస్థితులను సమీక్షించగా, పెద్దేముల్ ఎస్సై మాంబాపూర్‌లోని శ్రీ అన్నదాత రైస్ మిల్లును అధికారులతో కలిసి తనిఖీ చేసి ధాన్యం అన్‌లోడింగ్, నిల్వల నిర్వహణపై సూచనలు చేశారు. అలాగే కొడంగల్ సి.ఐ మరియు దుద్యాల్ ఎస్సై గౌరారంలోని శ్రీ సాయి పారా బాయిల్డ్ ఇండస్ట్రీ మరియు కొడంగల్‌లోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులను సందర్శించి యాజమాన్యాలతో సమావేశమై రైతులకు ఎలాంటి ఆలస్యం లేకుండా ధాన్యం స్వీకరణ చేపట్టాలని సూచించారు. మోమిన్‌పేట ఎస్సై మేకవనంపల్లిలోని కొనుగోలు కేంద్రాలను, యాలాల ఎస్సై శ్రీ బాలాజీ రైస్ మిల్లును సందర్శించి పాత ధాన్యం నిల్వల క్లియరెన్స్, కొత్త ధాన్యం సేకరణ, తేమ శాతం పరీక్షలు, తూకం ప్రక్రియ వంటి అంశాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా, నియంత్రణలో కొనసాగుతోందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా పోలీస్ యంత్రాంగం భరోసా కల్పించింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా సమీప పోలీస్ అధికారులకు లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.




# కోహ్లీ క్యాచ్ మిస్ చేయడమే మ్యాచ్ మలుపు: అజింక్య రహానే

**రాయ్‌పూర్, మే 14 :** ఐపీఎల్ 2026లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన కీలక పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అద్భుత విజయం సాధించింది. ఈ ఓటమితో కోల్‌కతా నైట్ రైడర్స్ ప్లేఆఫ్స్ ఆశలకు భారీ దెబ్బ తగిలింది. మ్యాచ్ అనంతరం కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే తమ జట్టు ఓటమికి ప్రధాన కారణం ఫీల్డింగ్ వైఫల్యమేనని అంగీకరించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ బ్యాటర్ అంగ్క్రిష్ రఘువంశీ 46 బంతుల్లో 71 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశా డు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, మూడు భారీ సిక్సర్లు ఉన్నాయి. చివర్లో రింకూ సింగ్ వేగంగా ఆడుతూ 29 బంతుల్లో అజేయంగా 49 పరుగులు చేసి స్కోరును మరిం త పెంచాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, రసిఖ్ సలాం దార్ తలా ఒక వికెట్ తీశారు. 193 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగ ళూరు జట్టుకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ఇన్నింగ్స్‌తో విజయాన్ని అందించాడు. కోహ్లీ కేవలం 60 బంతుల్లోనే 105 పరుగులతో అజేయ శతకం సాధించి మ్యాచ్‌ను ఒంటిచేత్తో ముగించాడు. అతని ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. అతనికి ఇతర బ్యాటర్లు కూడా సహకరించడంతో బెంగళూరు జట్టు 19.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్ కార్యక్రమంలో మాట్లాడిన అజింక్య రహానే కీలక వ్యాఖ్యలు చేశారు. "మా ఓటమికి ప్రధాన కారణం బ్యాటింగ్ కాదు.. ఫీల్డింగ్‌లో చేసిన పొరపాట్లే. విరాట్ కోహ్లీ క్యాచ్‌ను కీలక సమయంలో వదిలేయడం మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది" అని తెలిపారు. "కోహ్లీ లాంటి ఆటగాడికి అవకాశం ఇస్తే అతను మ్యాచ్‌ను పూర్తిగా మార్చేస్తాడు. కొత్తగా క్రీజులోకి వచ్చే బ్యాటర్‌కు ఈ పిచ్‌పై ఆడటం అంత సులభం కాదు. ఆ సమయంలో కోహ్లీని ఔట్ చేసి ఉంటే మ్యాచ్ పరిస్థితి వేరేలా ఉండేది" అని రహానే విశ్లేషించారు. గత కొన్ని మ్యాచ్‌లలో తమ జట్టు ఫీల్డింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిందని, కానీ ఇంత కీలకమైన మ్యాచ్‌లో సులభ క్యాచ్‌లు చేజార్చడం బాధాకరమని అన్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఇలాంటి చిన్న తప్పిదాలే పెద్ద మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి తీసుకొస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కోహ్లీ శతకంపై అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కీలక మ్యాచ్‌లో ఒత్తిడిని జయిస్తూ జట్టుకు విజయం అందించాడని కొనియాడుతున్నారు. ఈ విజయంతో బెంగళూరు జట్టు ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత బలపరుచుకోగా, కోల్‌కతా జట్టుకు మిగిలిన మ్యాచ్‌లు 'చావో రేవో'గా మారాయి.

# ముంబై ఇండియన్స్‌లో కలకలం

## బుమ్రా కెప్టెన్‌గా కొత్త రికార్డా?

ముంబై, మే 14 : ఈసారి ఐపీఎల్‌లో పూర్తిగా నిరాశపరిచిన ముంబై ఇండియన్స్ జట్టులో ఇప్పుడు కెప్టెన్సీ మార్పులు హాట్ టాపిక్‌గా మారాయి. ప్లేఆఫ్స్ రేసు నుంచి ఇప్పటికే తప్పుకున్న ముంబై.. మిగిలిన మ్యాచ్‌ల్లో పరువు కాపాడుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్‌తో ధర్మశాలలో జరగనున్న మ్యాచ్‌కు రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అందుబాటులో లేకపోవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. తాత్కాలిక సారథిగా వ్యవహరిస్తున్న సూర్యకుమార్ యాదవ్ కూడా జట్టుతో కనిపించకపోవడంతో ఇప్పుడు జట్టు పగ్గాలు జస్ప్రీత్ బుమ్రాకు అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలా జరిగితే ఒకే సీజన్‌లో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లతో ఆడిన జట్టుగా ముంబై ఇండియన్స్ అరుదైన రికార్డు సృష్టించనుంది. ఇప్పటికే హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించగా.. ఇప్పుడు బుమ్రా మూడో కెప్టెన్‌గా మారే అవకాశముంది. సీనియర్ ఆటగాడిగా జట్టులో ఎంతో అనుభవం ఉన్న బుమ్రాపై యాజమాన్యం, కోచ్‌లు నమ్మకం ఉంచినట్లు సమాచారం. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ఏదీ కలిసి రాలేదు. స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ జట్టు వరుస పరాజయాలతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ముఖ్యంగా కెప్టెన్ హార్దిక్ పాండ్యా వ్యూహాలు, అతడి వ్యక్తిగత ఫామ్ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాయి. ఎనిమిది మ్యాచ్‌ల్లో కేవలం 146 పరుగులు మాత్రమే చేసిన పాండ్యా.. బౌలింగ్‌లో కూడా నాలుగు వికెట్లతోనే సరిపెట్టుకున్నాడు. దీంతో వచ్చే సీజన్‌కు అతడిని జట్టు కొనసాగిస్తుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు బుమ్రాకు పూర్తి స్థాయి కెప్టెన్సీ ఇస్తే జట్టులో కొత్త ఉత్సాహం రావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పదమూడు ఏళ్లుగా ముంబై జట్టుకు సేవలందిస్తున్న బుమ్రాకు డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి గౌరవం ఉందని, జట్టును సమర్థంగా నడిపించే సామర్థ్యం కూడా ఉందని చెబుతున్నారు. రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాడు జట్టులో ఉన్నప్పటికీ భవిష్యత్ దృష్ట్యా బుమ్రాకే అవకాశం ఇవ్వొచ్చనే చర్చ సాగుతోంది. మొత్తంగా చూస్తే ముంబై ఇండియన్స్‌కు ఈ సీజన్ పూర్తిగా చేదు అనుభవంగా మారింది. ఇప్పుడు మిగిలిన మ్యాచ్‌ల్లో జట్టు ఎలా రాణిస్తుంది? బుమ్రా నిజంగానే కెప్టెన్ అవుతాడా? హార్దిక్ పాండ్యా భవిష్యత్‌పై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.



# తిలక్ వర్మ మెరుపులు!

ఆఖరి ఓవర్లో ఉత్కంఠ గెలుపు..

ముంబై ఇండియన్స్ అద్భుత ఛేదన

పంజాబ్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం..

వృథా అయిన ప్రభ్ సిమ్రన్ పోరాటం



**ధర్మశాల :** ఐ పీ ఎల్ లో భాగంగా హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ పీ సీ ఏ) స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ (పీ బీ కే ఎస్) పై ముంబై ఇండియన్స్ (ఎం ఐ) అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ రసవత్తర పోరులో ఆఖరి బంతి వరకు ఉత్కంఠ రేగగా.. ముంబై 6 వికెట్ల తేడాతో పంజాబ్ ను చిత్తు చేసింది. యువ కెప్టెన్ తిలక్ వర్మ విధ్వంసక అర్ధశతకంతో చెలరేగి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై ఇండియన్స్ 19.5 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 205 పరుగులు చేసి గెలుపు సంబరాలు చేసుకుంది. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో కదంతొక్కగా.. ర్యాన్ రికెల్టన్, విల్ జాక్స్ రాణించారు. బౌలింగ్ లో శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లతో పంజాబ్ పతనాన్ని శాసించాడు.

### ప్రభ్ సిమ్రన్, అజ్మతుల్లా దూకుడు..

టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. మంచు ప్రభావం (డ్యూ ఫ్యాక్టర్) ఉంటుందనే అంచనాలతో చేజింగ్ కు మొగ్గుచూపాడు. అయితే మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ కు ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ముంబై బౌలర్లను లక్ష్యంగా చేసుకుని మైదానం నలువైపులా భారీ సిక్సర్లు బాదాడు. కేవలం 32 బంతుల్లోనే 57 పరుగులు సాధించి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. అతనికి తోడుగా ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ సైతం బ్యాట్ ఝుళిపించాడు. 17 బంతుల్లోనే 38 పరుగులు సాధించి స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. చివర్లో ప్రియాంశ్ ఆర్య 17 బంతుల్లో 22 పరుగులు చేయడంతో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 39 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి పంజాబ్ భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. దీపక్ చాహర్ 36 పరుగులిచ్చి 2 వికెట్లు, రాజ్ బావా 11 పరుగులిచ్చి 1 వికెట్ తీశారు.

### కెప్టెన్ ఇన్నింగ్స్ తో ముంబై జయభేరి..

201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ కు ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ మెరుగైన ఆరంభాన్నిచ్చాడు. 23 బంతుల్లోనే 48 పరుగులు సాధించి జట్టును రేసులో నిలిపాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ బౌండరీల వర్షం కురిపించాడు. బాధ్యతాయుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ కేవలం 33 బంతుల్లోనే అజేయంగా 75 పరుగులు బాది మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ కేవలం 10 బంతుల్లోనే అజేయంగా 25 పరుగులు సాధించి ఫినిషర్ పాత్ర పోషించాడు. దీంతో ముంబై మరో బంతి మిగిలి ఉండగానే (19.5 ఓవర్లలో) 205 పరుగులు చేసి జయభేరి మోగించింది. పంజాబ్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 36 పరుగులిచ్చి 2 వికెట్లు, యుజ్వేంద్ర చాహల్ 32 పరుగులిచ్చి 1 వికెట్, మార్కో జాన్సెన్ 55 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టినా లాభం లేకపోయింది.

### పట్టికలో పంజాబ్, ముంబైల పరిస్థితి..

ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల ఖాతాను మెరుగుపరుచుకుంది. అయితే టోర్నీలో ఆరంభం నుంచే తడబడిన ముంబై (మొత్తం 12 మ్యాచ్ ల్లో 4 విజయాలు, 8 పరాజయాలతో 8 పాయింట్లు) ప్లే ఆఫ్స్ రేసులో వెనుకబడి పట్టికలో కిందిస్థాయిలోనే కొనసాగుతోంది. మరోవైపు ఈ మ్యాచ్ లో పోరాడి ఓడిన పంజాబ్ కింగ్స్ (మొత్తం 12 మ్యాచ్ ల్లో 6 విజయాలు, 6 పరాజయాలతో 12 పాయింట్లు) పట్టికలో నాలుగో స్థానంలో ఉంటూ ప్లే ఆఫ్స్ అవకాశాలను క్లిష్టమయం చేసుకుంది. తర్వాత జరిగే మ్యాచ్ ల్లో భారీ విజయాలు సాధిస్తే తప్ప పంజాబ్ ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. లీగ్ దశ ఆఖరి ఘట్టానికి చేరుకోవడంతో ప్రతి మ్యాచ్ టోర్నీ భవితవ్యాన్ని శాసిస్తోంది

# ఐపీఎల్‌లో కెప్టెన్లపై వేటు?

## అక్షర్, పంత్, రహానే భవితవ్యంపై సందేహాలు

**ముంబై, మే 14:** ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ పలు ఫ్రాంచైజీల్లో భారీ మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా వరుస వైఫల్యాలతో ప్లేఆఫ్స్‌కు జట్లను చేర్చడంలో విఫలమైన ముగ్గురు కెప్టెన్ల భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తదుపరి సీజన్‌లో కెప్టెన్లుగా కొనసాగుతారా లేదా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించగా, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కూడా దాదాపుగా అవకాశాలు కోల్పోయాయి. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యాలు సీరియస్‌గా సమీక్షలు ప్రారంభించినట్లు సమాచారం. ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహించిన అక్షర్ పటేల్ ఈ సీజన్‌లో బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. తొమ్మిది ఇన్నింగ్స్‌లలో కేవలం 100 పరుగులు మాత్రమే చేసి తీవ్ర నిరాశ పరిచాడు. అందులో ఒకే ఇన్నింగ్స్‌లో చేసిన 56 పరుగులు మినహా మిగిలిన మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. బౌలింగ్‌లో 12 మ్యాచ్‌లలో 10 వికెట్లు తీసినా, కీలక సమయాల్లో తాను స్వయంగా బౌలింగ్‌కు రావడంలో వెనుకంజ వేసిన తీరు విమర్శలకు దారితీసింది. కెప్టెన్‌గా వ్యూహాత్మక నిర్ణయాల్లో కూడా అక్షర్ బలహీనంగా కనిపించాడని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా యువ ఆటగాళ్ల వినియోగంలో చేసిన తప్పిదాలు ఢిల్లీ జట్టుకు భారీ నష్టంగా మారాయి. ప్రతిభావంతుడైన అభిషేక్ పోరెల్కు సరైన అవకాశాలు ఇవ్వకపోవడం, ఆల్‌రౌండర్ మాధవ్ తివారీను సరిగా ఉపయోగించుకోకపోవడం యాజమాన్యాన్ని అసంతృప్తికి గురి చేసినట్లు తెలుస్తోంది. ఇక రిషభ్ పంత్ పరిస్థితి కూడా అంతే క్లిష్టంగా మా రింది. భారీ మొత్తానికి లక్నో జట్టులో చేరిన పంత్ నుంచి అభిమానులు, యాజమాన్యం పెద్ద అంచనాలు పెట్టుకున్నాయి. కానీ ఈ సీజన్‌లో అతని ప్రదర్శన తీవ్ర నిరాశ కలిగించింది. 11మ్యాచ్‌లలో కేవలం 251 పరుగులు మాత్రమే చేసిన పంత్, తన సహజమైన దూకుడు ఆటను పూర్తిగా కోల్పోయినట్లు కనిపించాడు. కేవలం తొమ్మిది సిక్సర్లు మాత్రమే కొట్టడం అతని



ఫామ్ ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. కెప్టెన్సీ ఒత్తిడి అతని ఆటపై స్పష్టంగా ప్రభావం చూపిందని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జట్టు ఎంపికలోనూ పలు తప్పిదాలు చోటుచేసుకున్నాయి. యువ ఆటగాడు అర్షిన్ కులకర్ణిను ఓపెనర్‌గా పంపడం, దేశవాళీ క్రికెట్‌లో సాధారణ రికార్డులు మాత్రమే ఉన్న హిమ్మత్ సింగ్కు వరుస అవకాశాలు ఇవ్వడం వంటి నిర్ణయాలు విమర్శలకు గురయ్యాయి. అలాగే ఆయుష్ బదోనిను టాప్ ఆర్డర్‌లో ప్రయోగించడం కూడా ఫలితం ఇవ్వలేదు. జట్టులో నికోలస్ పూరన్, ఏడెన్ మార్క్రమ్ వంటి స్టార్ ఆటగాళ్లు ఫామ్ కోల్పోవడం కూడా లక్నో వైఫల్యానికి కారణమైంది. మరోవైపు కేకేఆర్ కెప్టెన్ అజింక్యా రహానేపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంప్రదాయ టెస్ట్ బ్యాటింగ్ శైలితో పేరొందిన రహానే టీ20 ఫార్మాట్‌కు అవసరమైన వేగాన్ని అందుకోలేకపోతున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో 237 పరుగులు చేసిన రహానే స్ట్రైక్ రేట్ కేవలం 133 మాత్రమే. టాప్ ఆర్డర్‌లో అతని నిదానమైన ఆట కారణంగా జట్టు పలుమార్లు ఒత్తిడిలో పడింది. యువ ఆటగాడు అంగ్క్రిష్ రఘువంశీ కూడా వేగంగా పరుగులు చేయడంలో విఫలమవడంతో కేకేఆర్ బ్యాటింగ్ దెబ్బతింది. 11 మ్యాచ్‌లలో ఈ ఇద్దరూ కలిసి కేవలం 25 సిక్సర్లు మాత్రమే కొట్టడం జట్టు దూకుడు ఎంత తక్కువగా ఉందో చూపిస్తోంది. టీ20ల్లో వేగవంతమైన బ్యాటింగ్ అత్యవసరమైన సమయంలో రహానే పాత శైలిలోనే కొనసాగడం అభిమానులను నిరాశపరుస్తోంది. ఇటీవల తన స్ట్రైక్ రేట్‌పై వచ్చిన విమర్శలకు స్పందిస్తూ "అసూయతో మాట్లాడుతున్నారు" అని రహానే చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. అయితే ప్రస్తుతం ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. క్రికెట్ వర్గాల అంచనాల ప్రకారం అక్షర్, పంత్‌లకు ఆటగాళ్లుగా ఇంకా మంచి డిమాండ్ ఉన్నప్పటికీ కెప్టెన్లుగా కొనసాగడం కష్టమేనని భావిస్తున్నారు. మరోవైపు రహానే భవిష్యత్తు మరింత అనిశ్చితంగా కనిపిస్తోంది. వచ్చే మినీ వేలంలో ఆయనపై ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతాయా లేదా అన్నది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.



# కామెడీ షోల వల్గారిటీపై బిందు మాధవి వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 14:** తెలుగు టెలివిజన్‌లో కామెడీ కార్యక్రమాలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా ప్రసారమవుతున్న కామెడీ షోలు ప్రేక్షకులను అలరిస్తూనే అనేక మంది కమెడియన్స్, యాంకర్లు, నటులకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే ఈ షోలపై డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గారిటీ జోక్స్, కుటుంబంతో కలిసి చూడలేని కొన్ని స్కిట్స్ ఉన్నాయనే విమర్శలు కూడా తరచూ వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు ఇదే అంశంపై హీరోయిన్, బిగ్‌బాస్ ఫేమ్ బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు తెలుగు టెలివిజన్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం బిందు మాధవి కొత్తగా ప్రారంభమైన 'మాస్ జాతర' కామెడీ షోలో జడ్జిగా వ్యవహరిస్తోంది. ఈ షో కూడా స్కిట్స్, వినోదాత్మక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే ఇతర కామెడీ షోల మాదిరిగా కాకుండా కుటుంబమంతా కలిసి చూసేలా క్లీన్ కామెడీ అందించడమే తమ లక్ష్యమని షో నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో పాల్గొన్న బిందు మాధవి కామెడీ షోలలో పెరుగుతున్న వల్గారిటీపై స్పందించింది. "మాస్ జాతర పూర్తిగా వినోదంతో నిండిన కార్యక్రమం. మొదట నన్ను జడ్జిగా చేయమని అడిగినప్పుడు వెంటనే అంగీకరించలేదు. ఎందుకంటే ఈ మధ్య చాలా కామెడీ షోలలో డబుల్ మీనింగ్ డైలాగ్స్, వల్గర్ కామెడీ ఎక్కువైపోయిందనే భావన కలిగింది. అలాంటి కార్యక్రమాలను చూసి కొంత అసహనం కూడా కలిగేది" అని చెప్పింది. తర్వాత షో దర్శకుడు ప్రత్యేకంగా వచ్చి ఈ కార్యక్రమం గురించి వివరించారని బిందు మాధవి తెలిపింది. "మా షోలో ఎలాంటి వల్గారిటీ ఉండదు. ఎక్కడైనా అసభ్యకరమైన డైలాగ్స్ ఉంటే మీరు మధ్యలోనే షో నుంచి వెళ్లిపోవచ్చు అని నాతో చెప్పారు. కుటుంబమంతా కలిసి కూర్చొని చూసేలా కార్యక్రమాన్ని రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అందుకే నేను ఈ షో చేయడానికి అంగీకరించాను" అని వివరించింది. ఇప్పటికే 28 ఎపిసోడ్లు పూర్తయ్యాయని, ఇప్పటివరకు ఒక్కసారి కూడా అసౌకర్యంగా అనిపించలేదని ఆమె చెప్పింది. "తెలుగులో కూడా వల్గారిటీ లేకుండా మంచి కామెడీ చేయవచ్చని మా షో నిరూపిస్తోంది. కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని వినోదాన్ని అందించడం చాలా ముఖ్యం. ఈ కార్యక్రమంలో భాగమవ్వడం నాకు గర్వంగా ఉంది" అంటూ బిందు మాధవి వ్యాఖ్యానించింది. ఆమె వ్యాఖ్యలు బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. బిందు మాధవి నేరుగా ఏ షో పేరు ప్రస్తావించకపోయినా, చాలా మంది నెటిజన్లు మాత్రం ఆమె వ్యాఖ్యలను ప్రముఖ కామెడీ షోలపై పరోక్ష విమర్శలుగా భావిస్తున్నారు. ముఖ్యంగా డబుల్ మీనింగ్ కామెడీపై గతంలో వచ్చిన విమర్శలను మరోసారి నెటిజన్లు ప్రస్తావిస్తున్నారు. తెలుగు టెలివిజన్‌లో కామెడీ షోల పరిణామంపై కూడా ఈ వ్యాఖ్యలతో చర్చ మొదలైంది. ఒకప్పుడు కుటుంబమంతా కలిసి చూసే వినోద కార్యక్రమాలుగా గుర్తింపు పొందిన షోలు, క్రమంగా ట్రెండ్ పేరుతో వల్గారిటీ వైపు వెళ్లాయని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నాయని, అందుకే షోలు కూడా మారాల్సి వస్తోందని మరికొందరు అంటున్నారు. ఇటీవల కుటుంబ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని క్లీన్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించే కార్యక్రమాలకు మళ్లీ ఆదరణ పెరుగుతోందని టెలివిజన్ విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల పోటీ పెరిగిన నేపథ్యంలో టీవీ షోలు కుటుంబ ప్రేక్షకులను నిలబెట్టుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి బిందు మాధవి చేసిన వ్యాఖ్యలు తెలుగు కామెడీ షోలలో వల్గారిటీ అంశాన్ని మరోసారి చర్చకు తెచ్చాయి. భవిష్యత్తులో వినోద కార్యక్రమాలు ఎటువైపు సాగుతాయో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్




స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. 'ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం' అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

# శోభిత సరదా కామెంట్ వైరల్






**హైదరాబాద్, మే 14:** అక్కినేని హీరో నాగచైతన్య, నటి శోభిత ధూళిపాళ జంట ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. పెళ్లి తర్వాత ఈ జంట ఎక్కడ కనిపించినా అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటోంది. తాజాగా విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న ఈ జంట ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో జరిగిన చిన్న సరదా సంభాషణ కారణంగా మరోసారి వార్తల్లో నిలిచింది. నిన్న అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న నాగచైతన్య, శోభితలను చూసేందుకు అభిమానులతో పాటు మీడియా ప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్నారనే సమాచారం అందిన వెంటనే ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు అక్కడికి చేరుకోవడం సాధారణమే. ఈ క్రమంలో చై–శోభిత జంట బయటకు వస్తుండగా కెమెరాలు వరుసగా క్లిక్‌మనిపించాయి. నాగచైతన్యతో కలిసి ఎయిర్‌పోర్ట్ నుంచి బయటకు వస్తున్న శోభిత ధూళిపాళ, అర్ధరాత్రి అయినా మీడియా అక్కడే ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే చిరునవ్వుతో మీడియా ప్రతినిధుల వైపు చూస్తూ.. "మీరు అస్సలు నిద్రపోరా?" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె చెప్పిన తీరు అక్కడున్న వారిని ఒక్కసారిగా నవ్వుల్లో ముంచెత్తింది. శోభిత వ్యాఖ్య విన్న నాగచైతన్య కూడా చిరునవ్వు చిందించడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. అనంతరం అభిమానులకు చేతులు ఊపుతూ ఈ జంట అక్కడి నుంచి కారులో వెళ్లిపోయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "శోభిత చాలా సహజంగా మాట్లాడింది", "మీడియా కష్టాన్ని సరదాగా గుర్తుచేసింది", "చై–శోభిత జంట చాలా క్యూట్‌గా ఉంది" అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కొందరు అభిమానులు ఈ జంట సింప్లిసిటీని ప్రశంసిస్తుండగా, మరికొందరు వీరిద్దరి అన్యోన్యత ఆకట్టుకుంటోందని అభిప్రాయపడుతున్నారు. తెనాలికి చెందిన శోభిత ధూళిపాళ మోడలింగ్ రంగం ద్వారా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బాలీవుడ్, తెలుగు, తమిళం, మలయాళం వంటి పలు భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. తన అందం, నటన, ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో తక్కువ సమయంలోనే సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఇటీవల అక్కినేని కుటుంబంతో ఆమెకు ఏర్పడిన అనుబంధం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఆమెకు మరింత క్రేజ్ పెరిగింది. ఇక నాగచైతన్య కూడా వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు. వ్యక్తిగత జీవితంలో కొత్త దశలోకి అడుగుపెట్టిన తర్వాత ఆయన మరింత ప్రశాంతంగా కనిపిస్తున్నారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. తరచూ కలిసి కనిపిస్తున్న నాగచైతన్య–శోభిత జంట సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న ఈ జంటపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.




# పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

## ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయి–ంలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷–లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷–లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷–లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ–సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# ఆంధ్రప్రదేశ్ సినీ రాజధానిగా తిరుపతి

- ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీ నిర్మాణమే లక్ష్యం..
- నిర్మాత కావ్య, సినీ నటుడు జయంత్
- మంత్రి కందుల దుర్గేష్‌తో 'పారడాక్స్ పిక్చర్స్' చర్చలు



**అమరావతి, మే 14:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా, త్వరలో సినీ రాజధానిగా కూడా రూపుదిద్దుకోనుంది. పారడాక్స్ పిక్చర్స్ స్టూడియోస్ వ్యవస్థాపకురాలు, నిర్మాత కావ్య, సినీ నటుడు జయంత్ గురువారం ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధి, విస్తరణపై వారు మంత్రికి తన దార్శనికతను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే భారీ స్థాయిలో తెలుగు మరియు పాన్-ఇండియా చిత్రాలను నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నట్లు నిర్మాత కావ్య తెలిపారు. ప్రముఖ రచయిత పి. జయకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తమ తదుపరి చిత్రం పూర్తిగా తిరుపతిలోనే నిర్మితమవుతోందని ఆమె వివరించారు. ఈ చిత్రంలో బల్గేరియా, జింబాబ్వే, జపాన్, టోగో మరియు ఆఫ్రికా వంటి దేశాలకు చెందిన అంతర్జాతీయ నటీనటులు పాల్గొంటున్నారని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువస్తుందని పేర్కొన్నారు. అలాగే, ఒక ప్రముఖ అంతర్జాతీయ వ్యక్తి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న బయోపిక్ కూడా తిరుపతిలోనే చిత్రీకరణ జరుపుకుంటున్నట్లు మంత్రికి వివరించారు. తిరుపతిలో కేవలం చిత్ర నిర్మాణమే కాకుండా, ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీలు, స్టూడియోలు, పోస్ట్-ప్రొడక్షన్ ఎకోసిస్టమ్స్ మరియు సినీ శిక్షణా సంస్థల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చలు జరిగాయి. రాష్ట్రంలోని యువతకు మరియు సాంకేతిక నిపుణులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఒక సమగ్ర సృజనాత్మక వాతావరణాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని నిర్మాత కావ్య ప్రస్తావించారు. పారడాక్స్ పిక్చర్స్ ప్రతిపాదించిన ఈ బృహత్తర విజన్‌పై మంత్రి కందుల దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదపడే ఇటువంటి ప్రయత్నాలను ప్రభుత్వం అభినందిస్తుందని తెలిపారు. రాబోయే కాలంలో తిరుపతి నగరం చలనచిత్ర నిర్మాణం, మీడియా ఆవిష్కరణలు మరియు సినీ పర్యాటకానికి ఒక శక్తివంతమైన కేంద్రంగా మారుతుందనే నమ్మకాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

# గార్బేజీ స్టేషన్‌లో జేసీబీ వాహనాలు

## కొత్త వాహనాలను ప్రారంభించిన ఎంపీ

**విజయవాడ, మే 14:** విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో 5 జేసీబీ వాహనాలను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సెంట్రల్ నియోజకవర్గంలో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో జేసీబీ వాహనాల ప్రారంభం ఆనందదాయకమని అన్నారు. గతంలో ఈ ప్రాంత వాసులు అనేక సమస్యలతో ఇబ్బంది పడేవారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బోండా ఉమా.. నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి కారణం ఎమ్మెల్యే ఉమా అనడంలో అతిశయోక్తి లేదన్నారు. డ్రైనేజ్‌లు, రోడ్లను సుందరీకరణగా తీర్చిదిద్దామన్నారు. గత ప్రభుత్వంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో చిన్న పనులు కూడా జరగలేదని విమర్శించారు. గ్రేటర్ విజయవాడ అభివృద్ధి కోసం ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. జేసీబీ యాజమాన్యానికి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్ సభ్యులు నిరంతరం కేంద్రం నుంచి నిధులు తెస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తెలిపారు. ప్రధాని, సీఎం.. ప్రతినెల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటూ ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో చెత్తా చెదారంగా ఉన్న ఈ ప్రాంతాన్ని టీడీపీ ప్రభుత్వం.. చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా మారుస్తోందని అన్నారు. విజయవాడ నగర అభివృద్ధి ఎంపీ కేశినేని శివనాథ్ కృషికి నిదర్శనమన్నారు. రూ.23 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అధికారం అలంకారం కాదని.. ఒక బాధ్యత అని బోండా ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు.






# ఏపీ పీజీఈసెట్ ఫలితాల విడుదల

## 93.29 శాతం ఉత్తీర్ణత నమోదు

## అధికారిక వెబ్‌సైట్‌లో ర్యాంక్ కార్డులు

**అమరావతి, మే 14:** ఉన్నత విద్యా ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీఈసెట్-2026 ఫలితాలను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ఫలితాలను ప్రకటించిన మంత్రి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది నిర్వహించిన ఏపీ పీజీఈసెట్ పరీక్షలకు మొత్తం 9,990 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 9,320 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 93.29గా నమోదైందని అధికారులు తెలిపారు. విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారని మంత్రి పేర్కొన్నారు. ర్యాంక్ కార్డులు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్ నమోదు చేసి ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. అదే విధంగా పోర్టల్ నుంచి ర్యాంక్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. 9552300009 నెంబర్ ద్వారా కూడా ఫలితాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. డిజిటల్ సేవల ద్వారా విద్యార్థులకు సులభంగా ఫలితాలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఏపీ పీజీఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత విద్యలో మరింత ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# 'రక్షణ సీమ'గా రాయలసీమ అవతరణ

## పుట్టపర్తిలో దేశ ప్రతిష్ఠాత్మక ఏఎంసీఏ ప్రాజెక్టుకు శ్రీకారం

## రక్షణ, డ్రోన్ రంగాల్లో వేల కోట్ల పెట్టుబడులు

**అమరావతి, మే 14**: ఒకప్పుడు రత్నాలకు, ఆ తర్వాత ఉద్యాన పంటలకు ప్రసిద్ధి చెందిన రాయలసీమ ప్రాంతం ఇప్పుడు దేశ రక్షణ రంగంలో కీలక కేంద్రంగా మారేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో రక్షణ, డ్రోన్ పరిశ్రమల్లో భారీ పెట్టుబడులు రాయలసీమకు రానున్నాయి. ఈ క్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శుక్రవారం భూమిపూజ జరగనుంది. సుమారు రూ.15,803 కోట్ల వ్యయంతో 650 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ, డీఆర్‌డీఓ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశపు తొలి ఐదో తరం స్టెల్త్



మల్టీ రోల్ యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్, సూపర్ క్రూయిజ్ సామర్థ్యాలతో ఈ యుద్ధ విమానాలు రూపొందనున్నాయి. తయారీతో పాటు విమానాల పరీక్షలు కూడా పుట్టపర్తిలోనే నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు అంచనా వేస్తున్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదనంగా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరో 400 ఎకరాల భూమిని కేటాయించినట్లు సమాచారం. కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న డ్రోన్ సిటీతో కలిసి రాయలసీమలో సమగ్ర రక్షణ పరిశ్రమల వాతావరణం ఏర్పడనుంది. దేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు మరో 12 రక్షణ, డ్రోన్ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపన జరగనుంది. ఈ అదనపు 12 ప్రాజెక్టుల ద్వారా రూ.4,145 కోట్ల పెట్టుబడులు, 6,071 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్, భారత్ డైనమిక్స్, హెచ్‌ఎఫ్‌సీఎల్, ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ వంటి ప్రముఖ సంస్థలు ఈ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కానున్నాయి. డ్రోన్, రోబోటిక్స్, ఏరోస్పేస్ రంగాలకు చెందిన అనేక సంస్థలు కూడా రాయలసీమలో తమ యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఈ ప్రాజెక్టులు మడకశిర, దొనకొండ, నెల్లూరు, కర్నూలు డ్రోన్ సిటీల్లో ఏర్పాటవుతాయి. భారీ పరిశ్రమల రాకతో రాయలసీమ పారిశ్రామిక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ప్రభుత్వం భావిస్తోంది. సాగునీటి ప్రాజెక్టులతో పాటు పరిశ్రమల అభివృద్ధి ద్వారా వెనుకబడిన ప్రాంతమనే ముద్రను తొలగించి రాయలసీమను "రక్షణ సీమ"గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది



# పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

## పురపాలక శాఖ మంత్రి నారాయణ

**విజయవాడ, మే 14:** పేదలకు నాణ్యమైన భోజనం అందించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం' అని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత ప్రభుత్వాన్ని ప్రజలు ఎంత కోరినా అన్న క్యాంటీన్లను మూసివేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అన్న క్యాంటీన్ల నిర్వహణలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. కృష్ణలంక, రాణిగారితోటలోని అన్న క్యాంటీన్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. రూ.5 చెల్లించి టోకెన్ తీసుకున్న మంత్రి.. అందరితో కలిసి భోజనం చేశారు. ఆయనతో పాటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యాన చంద్ర ఉన్నారు. అనంతరం క్యాంటీన్లలో ప్లేట్లు శుభ్రపరిచే విధానం, ఆహారం వడ్డించే ప్రాంతాల్లో పరిశుభ్రత, మినరల్ వాటర్, కూలర్లు, దోమతెరలు, ప్రత్యేక పార్కింగ్ వంటి సదుపాయాలను మంత్రి పరిశీలించారు. భోజనం చేస్తున్న ప్రజలను నేరుగా అడిగి ఆహారం నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'అన్న క్యాంటీన్లలో పరిశుభ్రమైన వాతావరణంలో ఎంతో రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. వారానికి ఒకరోజు మున్సిపల్ కమిషనర్లు స్వయంగా భోజనం చేసి నాణ్యతను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లోనూ కొత్తగా అన్న క్యాంటీన్లు ప్రారంభించామని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 3.5 లక్షల మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారని మంత్రి నారాయణ వెల్లడించారు.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం

## ముగ్గురు సభ్యులతో కమిటీ

**అమరావతి, మే 14:** అగ్రిగోల్డ్ బాధితులకు ఆరునెలల్లో న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సీఎం అధ్యక్షతన గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి సంబంధించి ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. 8రాష్ట్రాల్లో 19 లక్షల మంది బాధితులు ఉన్నారని తెలిపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 11 లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో బాధితుల సొమ్ము తిన్న వారిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని కొంతమంది కీలక అధికారులు ఉన్నారని వెల్లడించారు. అందువల్లే ఈ కేసుపై ముగ్గురు సభ్యులతో కమిటీ వేయాలని ఆదేశించారు. అగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారందరికీ తప్పనిసరిగా న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పర్యాటక రంగంలో భారత్ - అమెరికా బంధం

**అమరావతి, మే 14:** పర్యాటక రంగంలో భారత్-అమెరికా బంధం బలోపేతమవుతోందని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు అమెరికా పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా సచివాలయంలో మంత్రి దుర్గేశ్‌తో 'యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' భేటీ గురువారం జరిగింది. రాష్ట్ర పర్యాటక సంస్కరణలపై ప్రశంసలు కురపించింది. అమెరికా ఇన్వెస్టర్ల దృష్టికి ఏపీ పర్యాటక రంగం విధానాలను తీసుకెళ్తామని వెల్లడించారు. ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే పక్రియలో ఇలాంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో విదేశీ పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ - అమెరికా 75 ఏళ్ల మైత్రిపై మంత్రి దుర్గేశ్‌కి ప్రత్యేక పుస్తకం అందజేశారు.

# ట్రాన్స్‌జెండర్స్‌కు అండ

## వారు ఆత్మగౌరవంతో బతికేలా చర్యలు: మంత్రి డోలా

**అమరావతి, మే 14:** ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో ఆత్మగౌరవంతో జీవించాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వ్యాఖ్యానించారు. ట్రాన్స్‌జెండర్స్‌కి అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి డీబీవీ స్వామి అధ్యక్షతన ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా డీబీవీ స్వామి మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్స్‌కి ఆస్పత్రుల్లో ప్రత్యేక ఓపీ సదుపాయం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. బహిరంగ ప్రదేశాలు, ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్స్‌కి ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. సెర్ప్, మెప్మా సహకారంతో ట్రాన్స్‌జెండర్స్‌కి స్వయం ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. తిరుపతిలో గరీమా గృహం ఏర్పాటు చేసి నిరాశ్రయులైన వారికి ఆసరా కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ట్రాన్స్‌జెండర్స్‌లోని 676 మందికి ఇప్పటికే గృహాలు కేటాయించామని తెలిపారు. వారి రక్షణ కోసం సీఐడీ కేంద్ర కార్యాలయంలో స్వాభిమాన్ పేరుతో ప్రత్యేక ప్రొటెక్షన్ సెల్, హెల్ప్‌లైన్ (1091) ఏర్పాటు చేశామని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కి గుర్తింపు కార్డులు, సింగిల్ రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని ప్రకటించారు. మనమిత్ర వాట్సాప్ యాప్, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా వారు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి డీబీవీ స్వామి పేర్కొన్నారు.



# మళ్లీ పెరుగుదల బాటలో పసిడి ధరలు

హైదరాబాద్, మే 14: దేశవ్యాప్తంగా బంగారం ధరలు మరోసారి పెరిగాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, దిగుమతి సుంకాల పెంపు ప్రభావంతో పసిడి ధరలు వరుసగా ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా బంగారం, వెండిపై దిగుమతి సుంకం పెరగడంతో మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పెరిగినట్లు బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. బుధవారం ఉదయం నాటికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు మరింత పెరిగి వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. నగరంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.330 పెరిగి రూ.1,62,330కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.300 పెరిగి రూ.1,48,800గా నమోదైంది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్న సమయంలో బంగారం ధరలు వరుసగా పెరగడం కొనుగోలుదారులపై అదనపు భారం మోపుతోంది. మరోవైపు వెండి ధర కూడా స్వల్పంగా పెరిగి హైదరాబాద్‌లో కిలో రూ.3,20,100కు చేరుకుంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,64,180కు చేరగా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,50,500గా నమోదైంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,62,330గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,48,800 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,62,260గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,48,950గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత, అమెరికా ఆర్థిక విధానాలపై ఉన్న ఆందోళనలు, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపడం వంటి కారణాలతో బంగారం ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. డాలర్ మారకం విలువల్లో మార్పులు, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు కూడా పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. అయితే వెండి ధరల్లో మాత్రం కొన్ని ప్రాంతాల్లో తగ్గుదల కనిపిస్తోంది. దేశంలోని పలు నగరాల్లో కిలో వెండి ధర దాదాపు రూ.10 వేల వరకు తగ్గినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. చెన్నైలో ప్రస్తుతం కిలో వెండి రూ.3.15 లక్షల వద్ద ఉండగా, ఇతర నగరాల్లో రూ.3 లక్షల వరకు నమోదవుతోంది. బంగారం ధరలు వరుసగా పెరుగుతుండటంతో సాధారణ కొనుగోలుదారులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాల్సిన కుటుంబాలు ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు పెట్టుబడిదారులు మాత్రం పసిడిని భద్రమైన పెట్టుబడిగా భావిస్తూ కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# హైదరాబాద్‌లో వీఐ 5జీ సేవలు ప్రారంభం

**హైదరాబాద్, మే 14:** దేశీయ టెలికాం రంగంలో ఐదు జీ సేవల విస్తరణ వేగంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా హైదరాబాద్ నగరంలో అధికారికంగా ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ, ఇప్పుడు తెలంగాణ రాజధానిలో కూడా ఈ సాంకేతిక సేవలను విస్తరించింది. దేశంలో డేటా వినియోగం అత్యధికంగా ఉన్న ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తోందని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులకు మరింత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించేందుకు నగరంలో ఐదు జీ సేవలను ప్రారంభించినట్లు వెల్లడించాయి. ముఖ్యంగా వీడియో స్ట్రీమింగ్, ఆన్‌లైన్ గేమింగ్, క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఈ సేవలకు మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఐదు జీ సేవల విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అనేక టెలికాం టవర్లను ఆధునీకరించినట్లు సంస్థ తెలిపింది. ఆధునిక నెట్‌వర్క్ సాంకేతికతను ఉపయోగించి వినియోగదారులకు అధిక వేగంతో పాటు మెరుగైన కనెక్టివిటీ అందించేలా చర్యలు చేపట్టినట్లు వివరించింది. నగరంలోని కీలక ప్రాంతాల్లో ఇప్పటికే నెట్‌వర్క్ పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఐదు జీ సాంకేతికత ద్వారా వినియోగదారులు అధిక వేగంతో డౌన్‌లోడ్లు, తక్కువ ఆలస్యంతో వీడియో కాల్స్, మెరుగైన డిజిటల్ సేవలను పొందగలరని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, స్టార్టప్ సంస్థలు, డిజిటల్ సేవల రంగానికి హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతున్న నేపథ్యంలో ఐదు జీ విస్తరణకు ప్రాధాన్యం పెరిగింది. దేశవ్యాప్తంగా ఇప్పటికే పలు టెలికాం సంస్థలు ఐదు జీ సేవలను విస్తరిస్తుండగా, ఇప్పుడు వొడాఫోన్ ఐడియా కూడా తన నెట్‌వర్క్ విస్తరణను వేగవంతం చేస్తోంది. రాబోయే నెలల్లో మరిన్ని నగరాల్లో కూడా ఐదు జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.




# జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ

**ముంబై, మే 14:** దేశీయ డిజిటల్ రంగంలో కీలక స్థానాన్ని సంపాదించిన జియో ప్లాట్‌ఫామ్స్ సంస్థకు కొత్త నాయకత్వం లభించింది. రిలయన్స్ గ్రూప్ వారసుడిగా గుర్తింపు పొందిన ఆకాశ్ అంబానీను జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకం ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చినట్లు కంపెనీ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. వచ్చే ఐదేళ్ల పాటు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నట్లు పేర్కొంది. రిలయన్స్‌కు చెందిన డిజిటల్ సేవల విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ త్వరలో షేర్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న వేళ ఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. సంస్థ ప్రారంభ ప్రజా వాటాల విక్రయం కోసం ముసాయిదా పత్రాలను ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో మార్కెట్ నియంత్రణ సంస్థకు సమర్పించే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థ భవిష్యత్ వ్యూహాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆకాశ్ అంబానీకి కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఆకాశ్ అంబానీ ఇప్పటికే జియో టెలికాం సేవల విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 2014 అక్టోబర్ నుంచి రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్న ఆయన, 2022లో సంస్థ ఛైర్మన్‌గా



బాధ్యతలు స్వీకరించారు. యువ నాయకుడిగా టెక్నాలజీ రంగంపై మంచి పట్టు కలిగిన ఆకాశ్, జియో విస్తరణలో ప్రధాన పాత్ర పోషించిన వారిలో ఒకరిగా గుర్తింపు పొందారు. ఆకాశ్ అంబానీ నాయకత్వంలో జియో టెలికాం రంగంలో సంచలన వృద్ధిని నమోదు చేసింది. 2016లో ప్రారంభమైన కొద్ది నెలల్లోనే కోట్లాది వినియోగదారులను ఆకర్షించి దేశీయ టెలికాం రంగంలో భారీ మార్పులకు కారణమైంది. కేవలం ఆరు నెలల్లోనే 10 కోట్ల మంది వినియోగదారులను సొంతం చేసుకుని కొత్త రికార్డు సృష్టించింది. తక్కువ ధరల డేటా సేవలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ విస్తరణ ద్వారా జియో దేశవ్యాప్తంగా వేగంగా విస్తరించింది. ఇటీవల విడుదల చేసిన ఆర్థిక గణాంకాల ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ భారీ ఆదాయాలు నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని, దాదాపు రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. డిజిటల్ సేవలు, మొబైల్ కమ్యూనికేషన్, వినోదం, ఆన్‌లైన్ సేవల రంగాల్లో జియో విస్తరణ కొనసాగుతున్న నేపథ్యంలో సంస్థ భవిష్యత్‌పై పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతోంది. జియో ప్లాట్‌ఫామ్స్‌కు ఆకాశ్ అంబానీ నాయకత్వం రావడం ద్వారా డిజిటల్ రంగంలో సంస్థ మరింత దూసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ సేవలు, డిజిటల్ చెల్లింపులు, వినోద రంగాల్లో సంస్థ మరిన్ని విస్తరణ ప్రణాళికలను అమలు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

# బ్యాంకుల్లో ఐదు రోజుల పనిదినాలపై మళ్లీ డిమాండ్

**న్యూఢిల్లీ, మే 14:** దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పనిదినాల అమలుపై మరోసారి చర్చ ప్రారంభమైంది. బ్యాంకు ఉద్యోగ సంఘాలు చాలా కాలంగా చేస్తున్న ఈ డిమాండ్‌ను మళ్లీ కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాయి. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు ప్రధాని నరేంద్ర మోదీకు లేఖ రాశాయి. దేశవ్యాప్తంగా బ్యాంకు అధికారులను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది. ఐదు రోజుల పనిదినాల అమలు కేవలం ఉద్యోగుల సేవా నిబంధనలకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, ఇది ఇంధన పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, శక్తి వినియోగ తగ్గింపు, కార్యనిర్వహణ సామర్థ్యం వంటి అనేక ప్రయోజనాలకు దోహదపడుతుందని సంఘం పేర్కొంది. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులు భారీ పని ఒత్తిడిలో పనిచేస్తున్నారని సంఘం వెల్లడించింది. శాఖల నిర్వహణ, నగదు లావాదేవీలు, వినియోగదారుల సేవలు, రుణ వసూళ్లు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామీణ ఆర్థిక సేవల విస్తరణ




వంటి బాధ్యతల కారణంగా ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో వారానికి ఐదు రోజుల పనివిధానం అమలు చేస్తే ఉద్యోగుల సామర్థ్యం మరింత మెరుగవుతుందని అభిప్రాయపడింది. అలాగే ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది బ్యాంకు ఉద్యోగుల ప్రయాణ భారం తగ్గుతుందని సంఘం పేర్కొంది. ఒక రోజు అదనపు సెలవు కారణంగా పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గడంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని వివరించింది. విద్యుత్ వినియోగం, కార్యాలయ నిర్వహణ ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపింది. ప్రస్తుతం అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఐదు రోజుల పని విధానం అమలులో ఉందని, బ్యాంకింగ్ రంగంలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. ముఖ్యంగా డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరించిన నేపథ్యంలో శాఖలకు ప్రత్యక్షంగా వచ్చే వినియోగదారుల సంఖ్య కూడా గతంతో పోలిస్తే తగ్గిందని పేర్కొంటున్నాయి. ఇక బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పని విధానం అమలుపై గతంలో కూడా పలుమార్లు చర్చలు జరిగినప్పటికీ ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. కేంద్ర ఆర్థిక శాఖ, భారతీయ బ్యాంకుల సంఘం, ఉద్యోగ సంఘాల మధ్య ఈ అంశంపై గతంలో చర్చలు జరిగినట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# పాల ధరలు పెంపు.. సామాన్యులకు మరో భారం

**న్యూఢిల్లీ, మే 14:** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రముఖ డైరీ సంస్థలు మరో షాక్ ఇచ్చాయి. దేశీయ ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ అమూల్ పాలు ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. అమూల్ బ్రాండ్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ అన్ని రకాల పాల ప్యాకెట్లపై లీటరుకు రెండు రూపాయల చొప్పున ధరలు పెంచింది. ఈ కొత్త ధరలు మే 14 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ధరల పెంపుతో అరలీటర్ అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ శక్తి పాల ప్యాకెట్ల ధర ఒక్కో రూపాయి మేర పెరిగింది. లీటర్ అమూల్ గోల్డ్ పాలు ధర 68 రూపాయల నుంచి 70 రూపాయలకు చేరగా, అమూల్ తాజా ధర 55 రూపాయల నుంచి 57 రూపాయలకు పెరిగింది. అమూల్ బాటలోనే మరో ప్రముఖ డైరీ సంస్థ మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ముఖ్యంగా ఢిల్లీ పరిసర ప్రాంతాలు, ఇతర నగరాల్లో లీటర్ పాలపై రెండు రూపాయల వరకు పెంపు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. గేదె పాలు ధర లీటరుకు 75 రూపాయల నుంచి 80 రూపాయలకు పెరగగా, ఫుల్ క్రీమ్ పాలు ధర 69 రూపాయల నుంచి 72




రూపాయలకు చేరుకుంది. పాల ధరల పెంపుకు అనేక కారణాలు ఉన్నాయని డైరీ సంస్థలు చెబుతున్నాయి. ముఖ్యంగా పశువుల దాణా ధరలు భారీగా పెరగడం ప్రధాన కారణంగా పేర్కొంటున్నాయి. గడ్డి, తవుడు, ఇతర పశు ఆహార పదార్థాల ధరలు పెరగడంతో పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిందని సంస్థలు వెల్లడించాయి. అదేవిధంగా రవాణా ఖర్చులు కూడా పెరిగాయి. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో గ్రామాల నుంచి నగరాలకు పాలను తరలించే వ్యయం అధికమైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వేసవి కాలంలో సాధారణంగా పాల దిగుబడి తగ్గడం వల్ల సరఫరాపై ఒత్తిడి పెరిగిందని, దీంతో ధరలు పెంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటున్నాయి. ప్యాకేజింగ్ ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, శీతలీకరణ నిర్వహణ వ్యయాలు పెరగడం కూడా ధరల పెంపుకు కారణమయ్యాయి. ఈ అదనపు భారం చివరకు వినియోగదారులపైనే పడుతోందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే కూరగాయలు, వంటనూనెలు, గ్యాస్, ధాన్యాల ధరలు పెరిగిన పరిస్థితుల్లో ఇప్పుడు పాల ధరలు కూడా పెరగడంతో సామాన్య కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై మరింత భారం పడనుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న కుటుంబాలు, హోటళ్లు, టీ దుకాణాలు, స్వీట్లు తయారీదారులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముంది. ధరల పెరుగుదల నేపథ్యంలో కొంతమంది వినియోగదారులు స్థానిక డైరీ కేంద్రాలు, ప్రభుత్వ పాల సరఫరా సంస్థల వైపు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలో విజయ డెయిరీ వంటి ప్రభుత్వ పాల కేంద్రాల వద్ద ధరలు కొంత వరకు నియంత్రణలో ఉండే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# హర్మూజ్ మార్గం దాటిన భారత్ ఇంధన నౌకలు

**న్యూఢిల్లీ, మే 14:** అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత్‌కు వంటగ్యాస్ సరఫరాలో కీలకమైన పరిణామం చోటుచేసుకుంది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుంచి భారత్‌కు ఎల్‌పీజీ తీసుకువస్తున్న రెండు నౌకలు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. దీంతో ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ సముద్ర మార్గంలో సరఫరాలు మళ్లీ క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం 'సిమి' పేరుతో ప్రయాణిస్తున్న ఎల్‌పీజీ నౌక గురువారం ఒమన్ గల్ఫ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఖతార్‌లోని రాస్ లఫాన్ పోర్టు నుంచి బయలుదేరిన ఈ నౌక గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తోంది. ప్రయాణ సమయంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నౌక తన ట్రాన్స్‌పాండర్ సంకేతాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అంతర్జాతీయ నౌకాశ్రయ వర్గాలు తెలిపాయి. ఇక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని రువాయిస్ రిఫైనరీ నుంచి బయలుదేరిన 'ఎన్వీ సన్‌షైన్' అనే మరో వంటగ్యాస్ నౌక కూడా హర్మూజ్ జలసంధిని దాటి భారత జలాల దిశగా ప్రయాణిస్తోంది. ఈ నౌక కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు చేరుకోనున్నట్లు సమాచారం. ఈ నౌక కూడా జలసంధి దాటిన అనంతరం తన సిగ్నల్ వ్యవస్థను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ప్రపంచ ముడిచమురు, ద్రవీభవించిన సహజ వాయువు రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. మధ్యప్రాచ్య దేశాల నుంచి ఆసియా దేశాలకు వెళ్లే ఇంధన సరఫరాలో పెద్ద భాగం ఈ సముద్ర మార్గం ద్వారానే సాగుతుంది. భారత్‌కు అవసరమైన



ముడిచమురు, వంటగ్యాస్ సరఫరాలో కూడా ఈ మార్గం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంది. అందువల్ల ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారి ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుంది. ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ చర్చలు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా ప్రతిపాదించిన శాంతి ఒప్పందంపై ఇరాన్ స్పందన పూర్తిగా సంతృప్తికరంగా లేదని ఆయన తన సామాజిక మాధ్యమ వేదికలో పేర్కొన్నారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ తమ అభిప్రాయాన్ని అమెరికాకు పంపినట్లు అంతర్జాతీయ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా భారత్‌కు ఇంధన నౌకలు సురక్షితంగా చేరుతుండటం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ముఖ్యంగా వంటగ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఉండటం దేశీయ మార్కెట్‌కు కీలకంగా మారింది. పరిస్థితులను భారత్ నిశితంగా గమనిస్తోందని, అవసరమైతే ప్రత్యామ్నాయ ఇంధన సరఫరా మార్గాలపై కూడా దృష్టి పెట్టే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.